సాక్షి 24|7

ప్రకాశం

సోమవారం 1-1-2018



సుబ్బులు హంతకులను కఠినంగా శిక్షించాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మోహన్

దళిత, ప్రజాసంఘాల డిమాండ్

ఒంగోలు టౌన్:

చీరాల మండలం గవినివారిపాలెం గ్రామానికి చెందిన గిరిజన మహిళ దేవర సుబ్బులు కుటుంబంపై దాడి చేసి ఆమె మరణానికి కారకులైన ఆ గ్రామ సర్పంచ్‌తోపాటు మరో పద మూడు మందిని వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని దళిత, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. బాధిత సుబ్బులు కుటుంబ సభ్యులకు అక్కడి ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అనుచరుల నుంచి రక్షణ కల్పించాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సుబ్బులు హంతకులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మాదాల నారాయణస్వామి భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ మోహన్ మాట్లాడుతూ ఆమంచి అనుచరుల చేతుల్లో హత్యకు గురైన సుబ్బులు నివాసం ఉంటున్న స్థలానికి అక్రమంగా పొజిషన్ సర్టిఫికేట్ సృష్టించారన్నారు. తనకు న్యాయం చేయాలని సుబ్బులు జిల్లా కలెక్టర్‌కు అర్జీ ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో కలెక్టరేట్ వద్ద పురుగుల మందు తాగిన విషయాన్ని గుర్తు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోగా ఆమె కుటుంబీకులను సాంఘిక బహిష్కరణకు గురిచేశారన్నారు. ఈ సంఘటనపై ఈపూరుపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదన్నారు. ఆమంచి అండతో గవినివారిపాలెం సర్పంచ్ రమేష్ తన అనుచరులతో వెళ్లి ఇనుపరాడ్లు, మారణాయుధాలతో సుబ్బులుతోపాటు ఆమె కుటుంబీకులపై దాడి చేశారన్నారు. ఈ దాడిలో మరణించిన సుబ్బులు కుటుంబానికి న్యాయం చేయాలని కోరేందుకు వెళ్లిన ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. నియోజకవర్గంలో ఆమంచికి కొమ్ముకాస్తున్న చీరాల డీఎస్పీ, తహశీల్దార్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మా కుటుంబాన్ని అనుక్షణం వేధించారు:

ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అనుచరులు అనుక్షణం మా కుటుంబాన్ని వేధించారని సుబ్బులు కుమార్తె దివ్య తెలిపారు. వారి ఆగడాలను ఎదిరించినందుకే తన తల్లిని చంపేశారన్నారు. తన తల్లిని చంపిన వారిని శిక్షించి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కింద తన కుటుంబాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సందర్శించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ముందుకు రాలేదన్నారు. ఈ సమావేశంలో సుబ్బులు మరో కుమార్తె నాగలక్ష్మి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ రాజశేఖర్, జిల్లా కార్యదర్శి ఎం ధనరాజ్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ జాలన్న, అరుణోదయ అంజయ్య, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చావలి సుధాకరరావు, పౌరసమాజం నాయకులు జీ నరసింహారావు, ఏపీ గిరిజన సంఘం నాయకుడు ఎస్ శ్రీనివాసరావు, బహుజన రచయితల వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నూకతోటి రవికుమార్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏ రాఘవులు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మిరియం అంజిబాబు, బహుజన రాజ్యంపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా ఆంజనేయులు, ఆర్టీసీ కార్మిక సంఘం నాయకుడు వీ శివరావు తదితరులు పాల్గొని సుబ్బులు హత్యను ఖండించారు.

పులుల గణన శాస్త్రీయంగా ఉండాలి

డీఎఫ్‌వో జయచంద్రారెడ్డి


శిక్షణ తరగతులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎఫ్‌వో

పెద్దదోర్నాల: అధికారులు తమకు అందుబాటులో ఉన్న అధునాతన పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పులుల గణనను శాస్త్రీయంగా చేయాలని డీఎఫ్‌వో (అటవీశాఖ) జయచంద్రారెడ్డి సూచించారు. మండల పరిధిలోని చిన్నగుడిపాడు ఆర్డీటీ కార్యాలయంలో పులుల గణనకు సంబంధించి సిబ్బందికి ఆదివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. పులుల గణనలో సిబ్బంది పాటించాల్సిన మెళకువలతో పాటు, వైల్డ్‌లైఫ్ యాక్టు, అటవీ చట్టాల ఉల్లంఘన, అక్రమార్కులకు విధించే శిక్షలు, సిబ్బంది ప్రాథమిక విధులు, తదితర అంశాలపై డీఎఫ్‌వో అవగాహన కల్పించారు. దేశంలో పేరెన్నికగన్న పులుల అభయారణ్యమైన నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్నాయని, ఇక్కడ పనిచేసే ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలు గుర్తెరిగి విధులు నిర్వహించాలని చెప్పారు. పులుల గణనలో పాల్గొనే అధికారులు పులుల పాదముద్రలు, వాటి విసర్జిత పదార్థాలతో పాటు, చెట్ల మొదళ్లపై గోళ్ల రక్కులు తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల స్వేచ్ఛకు భంగం కలిగించడం, వాటి ప్రాణాలకు ముప్పు కలిగించే వారితో పాటు, అక్రమంగా కలప, వెదురు వంటి వనసంపదను దోచుకెళ్లే అక్రమార్కులను కోర్టుల ద్వారా కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ విధుల్లో ఉన్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుని దోషులను గుర్తించి శిక్షలు పడేలా చేయగలిగితే ముమ్ముందు నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టి వనాలు, వణ్యప్రాణాలను కాపాడుకోగలుగుతామని డీఎఫ్‌వో వివరించారు. శిక్షణలో రేంజి అధికారి సనీల్‌కుమార్, డీఆర్వో ప్రసాదరెడ్డితో పాటు డివిజన్‌లోని అటవీ అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌బీ డీఎస్పీ నాగరాజు బదిలీ

రాజమహేంద్రవరం అర్బన్ డీఎస్పీగా నియామకం

ఒంగోలు క్రైం:



జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) డీఎస్పీగా పనిచేస్తున్న ఉప్పుటూరి నాగరాజును బదిలీ చేస్తూ డీజీపీ నండూరి సాంబశివరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి ఎస్పీ కార్యాలయానికి శనివారం రాత్రి బదిలీ ఉత్తర్వులు చేరాయి. ఒంగోలు పోలీసు ట్రైనింగ్ కాలేజీ (పీటీసీ)లో డీఎస్పీగా పనిచేస్తున్న నాగరాజును 2016 జూన్ 26న ఎస్‌బీ డీఎస్పీగా అప్పట్లో నియమించారు. అదే రోజు ఎస్‌బీ డీఎస్పీగా ఒంగోలులో బాధ్యతలు చేపట్టారు. సరిగ్గా ఒకటిన్నర సంవత్సరం ఇక్కడ విధులు నిర్వర్తించిన తర్వాత తూర్పు గోదావరి జిల్లా ఈస్ట్ రాజమహేంద్రవరం అర్బన్ డీఎస్పీ (శాంతి భద్రతల విభాగం)గా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న డీఎస్పీ కె.రమేష్‌బాబును బదిలీ చేసి రాష్ట్ర పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని డీజీపీ నండూరి ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అందులో భాగంగా నాగరాజు శనివారం రాత్రే బయల్దేరి వెళ్లారు. ఆదివారం ఉదయమే రాజమహేంద్రవరంలో బాధ్యతలు కూడా చేపట్టారు. ఈ నెల 29వ తేదీ రాత్రి రాజమహేంద్రవరంలోని మసీదులో మౌజన్ మహ్మద్ ఫారూఖ్ హత్యకు గురయ్యాడు. మసీదులో దుండగులు ఖురాన్‌ను సైతం దహనం చేశారు. ప్రార్థన స్థలానికి నిప్పు పెట్టారు. అందులో భాగంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగింది. అక్కడ పనిచేస్తున్న డీఎస్పీ రమేష్‌బాబును రాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు పంపి నాగరాజును ప్రత్యేకంగా అక్కడకు బదిలీ చేశారు. ప్రకాశం జిల్లా ఎస్‌బీ డీఎస్పీగా ఇంకా ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం డిస్ట్రిక్ట్ క్రైం రివ్యూ బ్యూరో (డీసీఆర్‌బీ) డీఎస్పీగా పనిచేస్తున్న బి.మరియదాస్‌కు ఎస్‌బీ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎస్పీ బి.సత్య ఏసుబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

సాక్షి 24|7

ప్రకాశం

సోమవారం 1-1-2018



వెలుగుల తీరానికి ఉత్సాహంగా..

కాల ప్రవాహంలో మరో కొత్త ఏడాది...
కోటి ఆశలతో..కొంగొత్త ఆలోచనలతో
గుండె నిండా ఆత్మవిశ్వాసంతో స్వాగతిద్దాం
గత కాలపు వెలుగు నీడల అనుభవాల నావలో
వెలుగుల తీరం వైపు ఉత్సాహంగా సాగిపోదాం

- కొత్త ఏడాదికి సాదర స్వాగతం
- జిల్లాలో ఘనంగా న్యూఇయర్ వేడుకలు
- నూతన ఏడాదిలో మంచి జరగాలని ఆకాంక్ష

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: 2018 కొత్త ఏడాదికి సాదర స్వాగతం ..గతం మిగిల్చిన గాయాల్ని మాన్పి నూతన ఏడాది అందరి జీవితాల్లో మరిన్ని వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ జిల్లావాసులు సంబరాలతో స్వాగతం పలికారు. కొత్త ఏడాదిని స్వాగతిస్తూ చిన్నల నుంచి పెద్దల వరకూ అందరూ హ్యాపీ న్యూఇయర్ చెప్పుకున్నారు. ప్రత్యేకించి రాజకీయ నేతల ఇళ్ల వద్ద మరింతగా సందడి నెలకొంది. శుభాకాంక్షలు చెప్పేందుకు వారి అనుచరులు పోటీ పడ్డారు. ఫ్లెక్సీల పండుగ జోరుగా సాగింది. ఇక అర్ధరాత్రి వరకూ పాట కచేరీలు, నాటకాలు, డ్యాన్స్‌షోలతో పాటు రకరకాలు విన్యాసాలతో యువత సందడి చేశారు. మొత్తంగా న్యూఇయర్ స్వాగత సంబరాలు వాడవాడలా మిన్నంటాయి. అందరూ కోరుకొంది ఒక్కటే.. గత ఏడాదికంటే ఈ ఏడాది బాగుండాలి.

- మిగతా 6లో▸

నిర్లక్ష్యం ఖరీదు

కోటిన్నర!

- ఆర్అండ్‌బీ నిర్లక్ష్యంతో టెలికం కేబుల్ ధ్వంసం
- శాఖల మధ్య సమన్వయ లోపం
- రోడ్డు విస్తరణ పనుల్లో ప్రజాధనం వృథా
- కర్నూల్‌రోడ్డులో 5 కి.మీ పొడవున ధ్వంసమైన కేబుళ్లు
- రూ.1.50 కోట్ల మేర నష్టం
- నెల రోజులుగా మూగబోయిన ఫోన్లు, బ్రాడ్‌బాండ్ సేవలు
- తమ ఇబ్బందులు పట్టించుకోని అధికారులపై స్థానికుల ఆగ్రహం

చీమకుర్తి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన రెండు బాధ్యతాయుతమైన శాఖల మధ్య కొరవడిన సమన్వయం తీవ్ర నష్టానికి కారణమైంది. కోట్లాది రూపాయల విలువైన కేబుల్ వ్యవస్థను ధ్వంసం చేసింది. ఒంగోలు నగరం నుంచి కర్నూలు రోడ్డును ఫోర్‌లైన్‌గా విస్తరిస్తున్న విషయం తెలిసిందే. ఈ పనుల్లో భాగంగా ఆర్అండ్‌బీ అధికారులు ఒంగోలు బైపాస్ సమీపంలోని నవభారత్ భవనాల నుంచి పేర్నమిట్ట

- మిగతా 6లో▸



జబ్బు జేబులో డబ్బు

- ఖరీదుగా మారిన వైద్యం
- అక్కరకు రాని ఎన్టీఆర్ వైద్యసేవ
- వైద్యం కోసం పేద జనం అవస్థలు
- ఆస్తులమ్మి, అప్పులు చేసి నిలబెట్టుకుంటున్న ప్రాణాలు

- వివరాలు 9లో



ముగిసిన అంతర్జాతీయ పోటీలు

ముత్తుకూరు (నెల్లూరు): శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పోర్టులో నాలుగు రోజులుగా నిర్వహించిన 9వ ఎడిషన్ ఇంటర్నేషనల్ యూత్ సెయిలింగ్ కాంపిపిషన్ ఆఫ్ ఇండియా' పోటీలు ఆదివారం ముగిశాయి. చివరిరోజున జరిగిన ఫైనల్స్‌లో వివిధ దేశాల వేగాన్ని అధిగమించి భారతదేశం విజయ బావుటా ఎగురవేసింది. లేజర్ -47 విభాగంలో భారత్‌కు చెందిన హర్షిత్ తోమర్ ప్రథమ, సమ్‌సురావు ద్వితీయ, టీ చిత్రష్ తృతీయ స్థానాలు కైవసం చేసుకొన్నారు. లేజర్ రేడియల్ విభాగంలో భారత్‌కు చెందిన విష్ణుశరవణన్ ప్రథమ, కెనెడాకు చెందిన ట్యాయ్ స్టెఫినెక్ ద్వితీయ, భారత్‌కు చెందిన గోవింద బైరాగి తృతీయ స్థానాలు సాధించారు. లేజర్-420 విభాగంలో భారత్‌కు చెందిన అన్వన్య బేహాన్ ప్రథమ, భరత్ ద్వితీయ, పునీత్‌కుమార్‌సాహు తృతీయ స్థానాలను సొంతం చేసుకున్నారు. ఆప్టిమస్ విభాగంలో ఇండోనేషియాకు చెందిన రామ్‌దాన్ టిటో ప్రథమ, స్వీడన్‌కు చెందిన అలెగ్జాండర్ బేదిన్ ద్వితీయ, భారత్‌కి చెందిన ఈ దుర్గాప్రసాద్ తృతీయ స్థానాలు సొంతం చేసుకున్నారు. ఆప్టిమస్ గ్రీన్ విభాగంలో భారత్‌కు చెందిన బేతమల్ల సచిన్ ప్రథమ, పీ విశ్వనాథ్ ద్వితీయ, ఆర్యన్ ఆనంద్ తృతీయ స్థానాలు సాధించారు. కృష్ణపట్నంపోర్టు పోర్టు సౌత్ బెర్తుల వద్ద జరిగిన ఈ పోటీల్లో 11 దేశాలకు చెందిన 160 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.



మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు


మాట్లాడుతున్న రమాదేవి

ఒంగోలు టౌన్: రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారిపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మహిళా కమిషన్ సభ్యురాలు టి. రమాదేవి హితవు పలికారు. ఆదివారం ఒంగోలులోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ మహిళలు, బాలికలకు సంబంధించి ఏమైనా సంఘటనలు జరిగినప్పుడు కమిషన్ ఛైర్‌పర్సన్ హుటాహుటిన అక్కడకు చేరుకొని బాధితులను ఓదార్చే క్రమంలో కన్నీళ్లు పెట్టుకుంటున్నారని, అయితే దానిపై కూడా రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. ఆయా సంఘటనలకు సంబంధించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిషన్ ఛైర్‌పర్సన్ ఆదేశాలు ఇవ్వడంతోపాటు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలంటూ హెచ్చరిస్తున్నారన్నారు. కనిగిరిలో ఐదేళ్ల బాలికపై జరిగిన అఘాయిత్యంపై కూడా ఆమె స్పందించిన తీరును ప్రస్తావించారు. శాసనసభ్యురాలుగా, ప్రభుత్వ చీఫ్‌విప్‌గా, మంత్రిగా పనిచేసిన రాజకుమారిపై పద్మశ్రీ చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చీరాల్లో హత్యకు గురైన సుబ్బులు ఘటన గురించి పూర్తిగా తెలుసుకొన్న తరువాత స్పందిస్తానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.















నేడు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి రాక

ఒంగోలు:

ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సోమవారం ఉదయం 10.30 గంటలకు రోడ్డు మార్గంలో ఒంగోలు చేరుకుంటారు. జిల్లాలోని ప్రజలు, పార్టీ కార్యకర్తలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలంతా ఆనందం, ఆరోగ్యం, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశాయి.

రాష్ట్ర సీనియర్ మెన్ హాకీ జట్టు ప్రకటన



రాష్ట్ర హాకీ జట్టుతో అసోసియేషన్ నాయకులు

గుంటూరు స్పోర్ట్స్: గుంటూరు హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 21 నుంచి 31 వరకు స్థానిక బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిన హాకీ క్యాంప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిరంజన్ రెడ్డి జాతీయ సీనియర్ మెన్ హాకీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర హాకీ జట్టును ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హాకీ జట్టు జనవరి 7 నుంచి 21వ తేదీ వరకు మణిపూర్‌లోని ఇంఫాల్‌లో జరిగే 8వ సీనియర్ మెన్ జాతీయ హాకీ చాంపియన్ షిప్‌లో పాల్గొంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కుమ్మర క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సీనియర్ మెన్ హాకీ జట్టు:
ఎం.అజయ్ బాబు, కె.శ్రీనివాసరావు(కెప్టెన్), సీహెచ్ వేణు మాధవ్, జి.రమేష్ బాబు, ఎం.అశోక్ రెడ్డి, ఆర్.కమల్, సీహెచ్ అవినాష్, షేక్ బాబ్‌జాన్, కె.శ్రీకాంత్, ఎ.వెంకట శ్రీబాలాజి, ఎస్.రమేష్, కె.రాంబాబు, బి.కుసుమ్ కుమార్, బి.జగదీష్ బాబు, బి.శ్యామ్, పి.పవన్ శాంతకుమార్, పి.తేజ్ కిరణ్, ఎం.నాగేంద్ర, ఎ.కీర్తి, టీ.ఎస్.రాజు(టీమ్ మేనేజర్), రమేష్ బాబు (కోచ్).

వెలుగుల తీరానికి ఉత్సాహంగా..

మూడవ పేజీ తరువాయి

ఈ ఏడాది వరుణుడు కరుణించాలి..మూడేళ్ల వరుస కరువులు తీరేలా వానలు హోరెత్తాలి. సాగర్‌తో పాటు మధ్య తరహా ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నీటితో నిండాలి. ఒంగోలు గిత్తలు రంకేయాలి. జిల్లా పచ్చని పంటలతో కళకళలాడాలి. ధాన్యపు రాసులు...గల్లా పెట్టెలు డబ్బుల గలగలలతో హోరెత్తాలి. గిట్టుబాటు ధరలు రావాలి...అన్నదాతలతో పాటు అందరి కష్టాలు తీరాలి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలపై కట్టుబడాలి. దొనకొండ, కనిగిరి, సముద్ర తీరప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పాలి. చంద్రబాబు సర్కార్ ఇంటికో ఉద్యోగం కాకపోయినా కనీసం ఊరికో ఉద్యోగమైనా ఇవ్వాలి. ఉద్యోగం ఇవ్వని నిరుద్యోగులకు కొత్త ఏడాదిలోనైనా నిరుద్యోగ భృతి ఇచ్చేలా బాబుకు మనసు రావాలి. వెలిగొండను అధికార పార్టీ పెద్దలకు నిధులు తెచ్చిపెట్టే ధనాగారంగా చూడక జిల్లా వాసులకు సాగు–తాగు నీరిచ్చే ప్రాణదాతగా చూడాలి. కొత్త ఏడాదిలో నిధులిచ్చి..నీళ్లిచ్చేలా ప్రభుత్వం ప్రాజెక్టును చిత్తశుద్ధితో పూర్తి చేయాలి. వెనుకబడిన ప్రకాశం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే రామాయపట్నం పోర్టుకు కొత్త ఏడాదిలోనైనా రూపు తేవాలి. ఇందుకు బాబు మనస్సు కరిగేలా జిల్లా అధికారపార్టీ నేతలు ఒత్తిడి తేవాలి. సుబాబుల్, జామాయిల్‌తో పాటు పొగాకు రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలి. జిల్లాలోని అన్ని సమస్యల పరిష్కారానికి కొత్త ఏడాదిలో ముందడుగు పడాలి. ప్రకాశంలో వెలుగులు ప్రకాశించాలని అందరి ఆశ...ఆకాంక్ష... ఆ ఆశతోనే ముందడుగు వేద్దాం...!



ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలి

ఒంగోలు: ప్రజల జీవితాల్లో నూతన సంవత్సరం నూతన కాంతులను నింపాలని ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మాజీమంత్రి, ఒంగోలు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు బాలినేని శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. పంటల దిగుబడి పెరగాలని, రైతు లోగిలి పాడి పశువులతో కళకళలాడాలని, డ్వాక్రా అక్కాచెల్లెళ్ల మోముల్లో చిరునవ్వులు విరియాలని, ప్రజానీకం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు ప్రజలకు కలగాలని కోరుకుంటున్నానని మంత్రి శిద్దా రాఘవరావు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లా కలెక్టర్ వి.వినయ్‌చంద్, జిల్లా ఎస్పీ సత్య ఏసుబాబు ఆకాంక్షించారు.


బేకరీ వద్ద న్యూ ఇయర్ కేకులు కొనుగోలు చేస్తున్న జనం


శుభాకాంక్షలు తెలిపేందుకు పూల బొకేలు, పూలమాలలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నిర్లక్ష్యం ఖరీదు కోటిన్నర!

మూడవ పేజీ తరువాయి


సంతనూతలపాడు వైపునకు సుమారు 5 కి.మీ పొడవునా రోడ్డును తవ్వేశారు. విచక్షణా రహితంగా తవ్వేయడంతో మార్జిన్ కింద ఉన్న టెలికం రంగానికి చెందిన కోట్ల విలువ చేసే కేబుల్ వైర్లు ధ్వంసమయ్యాయి. బీఎస్ఎన్ఎల్‌కు చెందిన విలువైన కేబుల్ పూర్తిగా ధ్వంసమైందని టెలికం అధికారులు వాపోతున్నారు. ఆర్అండ్‌బీ, టెలికం రంగాలకు చెందిన రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడమే టెలికం కేబుల్ ధ్వంసం కావడానికి కారణంగా కనిపిస్తోంది. ఒంగోలు అంజయ్య రోడ్డు, పేర్నమిట్ట పరిధిలోనున్న టెలికం కార్యాలయాలకు చెందిన కేబుల్ కర్నూల్ రోడ్డులో ఎక్కువగా ఉంది. ధ్వంసమైన కేబుల్ విభాగాల్లో 200 పెయిర్, 100, 20, 15 పెయిర్ కేబుల్స్ ఉన్నట్లు సాంకేతిక సిబ్బంది తెలిపారు. మెయిన్‌లైన్‌తో పాటు డిస్ట్రిబ్యూషన్ లైన్ల నుంచి పక్కనున్న వీధులకు సరఫరా చేసే కేబుల్స్ ధ్వంసమైన వాటిలో ఉన్నాయన్నారు.

మూగబోయిన ఫోన్లు..

ధ్వంసమైన కేబుల్, మళ్లీ వాటిస్థానంలో ఏర్పాటు చేయాల్సిన కొత్త కేబుల్ విలువలే బీఎస్ఎన్ఎల్‌కు చెందిన వాటి విలువ సుమారు రూ.50 లక్షల వరకు ఉండొచ్చని, ఇక ప్రైవేటు రంగానికి చెందిన ఐడియా, ఎయిర్‌టెల్, రిలయన్స్ వంటి సంస్థలకు చెందిన కేబుల్స్ విలువ మరో రూ. 50 లక్షలు ఉంటుందని అంచనా. వాటితో పాటు నెల రోజులుగా కేబుల్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసం కావడంతో వాటి పరిధిలోనున్న ల్యాండ్‌లైన్ ఫోన్‌లు, బ్రాడ్‌బాండ్‌లు, సెల్‌ఫోన్‌లు వేల సంఖ్యలో మూగబోయినట్లు వినియోగదారులు వాపోతున్నారు. వాటి ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని టెలికం కంపెనీలకు రెవెన్యూ ద్వారా సుమారు మరో రూ.50 లక్షలు ఆదాయాన్ని కోల్పోయినట్లు ఆయా శాఖల అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన కేబుల్‌కు పరిహారాన్ని ఆర్అండ్‌బీ డిపార్టుమెంట్ నుంచి వసూలు చేసుకోవచ్చా..? రోడ్డు విస్తరణలో టెలికం వారికి ముందస్తు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత లేదా..? అనే అంశాలపై ఆర్అండ్‌బీ అధికారుల వద్ద స్పష్టత లేకపోవడం గమనార్హం. నెల రోజుల పాటు ప్రజలకు అందాల్సిన టెలికం సేవలకు ప్రజలు పడిన అవస్థలకు ఎంత విలువ కడతారని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.


దెబ్బతిన్న బీఎస్ఎన్ఎల్ కేబుల్‌ను బాగుచేస్తున్న టెక్నీషియన్‌లు (ఇన్‌సెట్లో) సన్నసన్నని వైర్లు కలపడంలో ఎన్ని తిప్పలో ....

మన ఒంగోలు



రిపోర్టర్ల ఫోన్ నెంబర్లు : ఒంగోలు - శ్రీనివాసరావు : 9705347541 ; ఒంగోలు టౌన్ - కిషోర్ : 9705347546 ; ఒంగోలు క్రైం - మాల్యాద్రి : 9951760678 ; ఒంగోలు సెంట్రల్ - సువర్ణరాజు : 9063790999 ; ఒంగోలు టూటౌన్ - ఏడుకొండలు : 9618874024 ; ఒంగోలు అర్బన్ - రామకృష్ణ : 8520084565 ; ఒంగోలు కల్చరల్ - ఎంవీఎస్ శాస్త్రి : 9948409528; ఒంగోలు రూరల్ - కరుణాకర్ : 9959590335 ; కొత్తపట్నం - వెంకట్రావు : 9963873908

2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు 2018

కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలి



మాట్లాడుతున్న మహదేవయ్య

అద్దంకి రూరల్: పోస్టల్ ఉద్యోగులకు సంబంధించి కమలేశ్ చంద్ర కమిటీ చేసిన సిఫార్సులను వెంటనే అమలు చేయాలని ఏఐజీడీ ఎస్‌యూ (ఆల్ ఇండియా గ్రామీణ ఢాక్ సేవక్స్ యూనియన్ ఆంధ్ర ప్రదేశ్ సర్కిల్) సంఘ అలిండియా అధ్యక్షుడు ఎస్ఎస్ మహదేవయ్య అన్నారు. మండలంలోని సింగరకొండలో ఉన్న వేమారెడ్డి సేవా సమిత అన్నదాన సత్రంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. వీలైనంత త్వరగా కమిటీ సిఫార్సు అమలుకు, అనుసరించాల్సిన వ్యూహాలను రచిస్తున్నట్లు చెప్పారు. అమలు చేయడంలో ప్రభుత్వం అలసత్వం చూపిస్తే పోటారాలకు సిద్ధపడి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా నూతన సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బీవీ రావు, జిల్లా కార్యదర్శి కేబీ మీరావలి, శ్రీనివాసకుమార్, రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన 400 మంది గ్రామీణ ఢాక్ సేవక్స్ పాల్గొన్నారు.

సింబయోసిస్ టెస్ట్‌లో టైం విద్యార్థికి నేషనల్ ఫస్ట్ ర్యాంక్



అభినందనలు అందుకుంటున్న విద్యార్థి ఊటుకూరి అవినాష్

ఒంగోలు: స్థానిక గాంధీ రోడ్డువాసి, ఒంగోలు టైం కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన ఊటుకూరి అవినాష్ జాతీయస్థాయిలో ప్రథమ ర్యాంకును కై వసం చేసుకున్నాడు. సింబయోసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నిర్వహించే సింబయోసిస్ నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్టులో 95.9965 పర్సంటైల్‌తో జాతీయస్థాయి ఈ ఘనత సాధించాడు. టైం కోచింగ్ సెంటర్ ఒంగోలు డైరెక్టర్ ఎల్.మోహన్‌కుమార్ వివరాలు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఊటూకూరి అవినాష్ బీటెక్ అనంతరం ఎంబీఏ కోసం తమ వద్ద లాంగ్‌టర్మ్‌కోచింగ్ తీసుకున్నాడన్నారు. ఎస్.ఐ.యుకు సంబంధించి దేశవ్యాప్తంగా ఉన్న 15 కాలేజీల్లో 1867 సీట్లు ఉన్నాయని, ఇక్కడ ఎంబీఏ పూర్తి చేసిన వారికి నెలకు కనీసం రూ. 15లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. అవినాష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 60 వేలమందికి పరీక్ష రాసినట్లు చెప్పాడు.అధ్యాపకులు రామకృష్ణ, వాసుబాబుతోపాటు అవినాష్ తల్లిదండ్రులు ఊటుకూరి సాంబశివరావు, శ్రీదేవి అభినందించారు.

ప్రకాశంను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చాలి

ఒంగోలు టౌన్:

ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చి నిధులు కేటాయించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి అధ్యక్షుడు వి. మాలకొండారెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశ తీర్మానాలను జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎల్ ప్రసాద్ పత్రికలకు విడుదల చేశారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చేందుకు వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, సైన్స్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కె. రామారావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు కె. సుబ్రహ్మణ్యాచారి, జిల్లా నాయకులు ఏవీ పుల్లారావు, పి. స్వరూపారెడ్డి, యు. భాస్కర్, వి. వెంకటేశ్వర్లు, కె. ప్రభుదాసు పాల్గొన్నారు.

ఊహలు గుసగుసలాడే!

- పంచాయతీ ముందస్తు ఎన్నికలపై సర్వత్రా చర్చ
- జిల్లాలో 100 వరకు వార్డులు, సర్పంచ్ పదవుల ఖాళీ
- ఇన్‌చార్జులుగా కొనసాగుతున్న ఉప సర్పంచ్‌లు



ఒంగోలు టూటౌన్: గ్రామపంచాయతీ ఎన్నికలు గడువు కన్నా ముందే జరగనున్నాయా ? లేక గడువు పూర్తయ్యాకే ఎన్నికలు నిర్వహిస్తారా అనే అంశం స్థానిక సంస్థల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది. గడువు ముగియక ముందే ముందస్తు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో సర్కార్ ఉందన్న ఊహాగాహానాలు వినిపిస్తున్నాయి. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నా సామెత మాదిరిగా అధికారంలో ఉండగానే సర్పంచుల ఎన్నికలు నిర్వహించి తమ ఆధిపత్యం నిరూపించుకోవాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితమే జిల్లా పంచాయతీ అధికారులు కసరత్తు చేశారు. ఎప్పుడైనా ఉపపోరు నిర్వహించేందుకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వొచ్చని అప్పట్లోనే అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత ఎలాంటి సంకేతాలు రాలేదు. అయితే ఇటీవల మమా రాష్ట్ర నుంచి బ్యాలెట్ బాక్స్‌లు జిల్లాకు వచ్చాయి. దీంతో ముందస్తు పంచాయితీకి సర్కార్ సిద్ధమవుతుందన్న ప్రచారం జోరందుకుంది. 2018 ఆగస్టు నాటికి ప్రస్తుత పంచాయతీల పాలకవర్గం గడువు పూర్తవుతోంది. గడువు తీరాక ఎన్నికలు నిర్వహిస్తే ఫలితాలు ఎలా ఉంటాయోనన్న భయం ప్రభుత్వానికి లేకపోలేదు.

1030 పంచాయతీలు

జిల్లాలో 56 మండలాలుండగా.. కందుకూరు, మార్కాపురం, ఒంగోలు రెవెన్యూ డివిజన్లున్నాయి. వీటి పరిధిలో మొత్తం 1030 పంచాయతీలుండగా.. ఐదేళ్లకొకసారి ప్రజాస్వామ్య బద్ధంగా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలి. అందులో భాగంగానే 2013 జూన్, జూలై నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలను అప్పటి ప్రభుత్వం నిర్వహించింది. ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు ఆగస్టు 2న పదవి బాధ్యతలు చేపట్టారు. అయితే ఈ మధ్య కాలంలో కొన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు అనారోగ్య కారణాల వల్ల చనిపోయారు. ఒకటి, రెండు చోట్ల రాజీనామాలు చేసినట్లు సమాచారం. సర్పంచులతో పాటు వార్డు మెంబర్లు కూడా కొంత మంది చనిపోయారు. ఈ విధంగా గ్రామ పంచాయతీల్లో ఖాళీ అయిన సర్పంచులు, వార్డు మెంబర్లు దాదాపు 100 పైగా ఉన్నాయి. వీటిలో సర్పంచుల ఖాళీలు 12 ఉన్నాయి. వార్డు మెంబర్లను మినహాయిస్తే చనిపోయిన సర్పంచులు, రిజైన్ చేసి తప్పుకున్న ఖాళీల స్థానంలో ఉప సర్పంచులే ఇన్‌చార్జులుగా కొనసాగుతున్నారు. కుంటుపడిన పాలన ప్రభుత్వం గ్రామపంచాయతీల్లో ఖాళీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో నాలుగేళ్లుగా స్థానిక పాలన కుంటుపడిందని ఆయా గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏదైన సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదని వాపోతున్నారు. పైగా పంచాయతీ అధికారులపై పర్యవేక్షిణ చేసేనాథుడు లేకపోవడంతో వారు ఆడిందే ఆటగా .. పాడిందే పాటగా మారింది. పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు ఖాళీ అయిన ఆరు నెలలకే ఎన్నికలు నిర్వహించుకునే పాలకులు స్థానిక సంస్థలకు ఉప ఎన్నికలు నిర్వహించకపోవడం ప్రభుత్వం వైఫల్యమేనని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి. వీరభద్రాచారి, సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది.

సర్పంచే ప్రథమ పౌరుడు

స్థానిక సంస్థల బలోపేతానికి సర్పంచులే కీలకం. పంచాయతీల్లో ప్రథమపౌరుడైన సర్పంచ్ ప్రజల నుంచి నేరుగా ఎన్నికవుతాడు. వార్డు మెంబర్లు పాలనలో భాగస్వామ్యమైనా సర్పంచి విధి, విధానాలకు దూరం. 73, 74 రాజ్యాంగ సవరణకు విరుద్ధం. ఈ పరిస్థితుల్లో రాష్ట్రం విడిపోయి రెండేళ్లు కావస్తున్న రాష్ట్రానికే ఎన్నికల కమిషన్ నియమించకపోవడం ప్రభుత్వ వైఫల్యమే. ఇప్పుడైనా ముందస్తు ఎన్నికలు జరుగుతాయో లేదోనన్న సందేహం స్థానిక సంస్థల్లో చర్చనీయాంశమవుతోంది.

సర్పంచులు లేని గ్రామాలు ఇవే..

బల్లికురవ మండలం వేమవరం గ్రామం, చిన్నగంజాం మండలం పల్లెపాలెం, కారంచేడు మండలం కేశవరప్పాడు, కొత్తపట్నం మండలం పాదర్తి, టంగుటూరు మండలం కారంచేడు, బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారం, యర్రగొండపాలెం మండలం గంగపాలెం గ్రామం, గిద్దలూరు మండలం కొమ్మునూరు గ్రామం, ముండ్లమూడు మండలం శంకరాపురం, పీసీ పల్లె మండలం పెద అలవలపాడు గ్రామం, ఉలవపాడు మండలం రామాయపట్నం, కొండపి మండలం గుర్రపడియగ్రామం, అంకర్లపూడి గ్రామాలకు సర్పంచులు లేరు. కందుకూరు మండలంలో ఉన్న ఆనందపురం, దివివారిపాలెం గ్రామాలను కందుకూరు మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఒకటి రెండు గ్రామాలు కోర్టుల్లో కేసుల కారణంగా ఎన్నికలు జరగని పరిస్థితి నెలకొందని సమాచారం.

జాతీయ తైక్వాండో పోటీల్లో ఒంగోలు విద్యార్థుల విజయభేరి

– జాతీయ ఉత్తమకోచ్‌గా కరిముల్లా

ఒంగోలు:

కేరళలోని పెయ్యనూర్‌లో డిసెంబర్ 27 నుంచి 29వ తేదీవరకు జరిగిన జాతీయ తైక్వాండో పోటీల్లో ఒంగోలుకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. 9 మందికి బంగారు, నలుగురికి వెండి, మరో ఇద్దరికి కాంస్య పతకాలు లభించాయి. సాయిరాం, శ్యామ్, మురళి, ప్రశాంత్, అజిత్‌కుమార్, ఫాల్గుణ, తన్మయి, నాగశ్రీ, కోమల నాగక్షలు బంగారు పతకాలను గెలుచుకున్నారు. ఆరిఫ్, షబ్బీర్, జయప్రకాష్, షౌకత్‌లు వెండి, కనిష్కర్, అస్మానాలు కాంస్యపతకాలను కైవసం చేసుకున్నారు. అలాగే జాతీయ ఉత్తమ కోచ్ అవార్డు ఒంగోలు తైక్వాండో అసోసియేషన్ కోచ్ షేక్ కరిముల్లాకు లభించింది. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను, కరిముల్లాను జాతీయ తైక్వాండో అధ్యక్షుడు బి.వి రమణయ్య, ఒంగోలు తైక్వాండో అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, రామాల హరనాథ్, సుభాని, గొర్రెపాటి సురేష్, ఎన్.చంద్ర అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులు



అవార్డు అందుకుంటున్న షేక్ కరిముల్లా

11 నుంచి చీమకుర్తిలో బాలోత్సవం

- వివరాలు తెలిపిన బాలోత్సవం కమిటీ చైర్మన్ చెరుకూరి

చీమకుర్తి: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జనవరి 11,12,13 తేదీల్లో జిల్లా స్థాయి బాలోత్సవం–2018 కార్యక్రమాలు చీమకుర్తిలో నిర్వహించనున్నారు. ఈమేరకు బాలోత్సవం కమిటీ చైర్మన్, రోటరీక్లబ్ వ్యవస్థాపకుడు చెరుకూరి రఘుకిరణ్, క్లబ్ అధ్యక్షుడు శిద్దా సురేష్ తెలిపారు. ఆదివారం స్థానిక కిరణ్ ఎక్స్‌పోర్టు కార్యాలయంలో రఘుకిరణ్ మాట్లాడుతూ గత 4 సంవత్సరాలుగా రోటరీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లోని సృజనాత్మకశక్తిని వెలికితీసేందుకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యవక్తగా జె.డి.లక్ష్మీనారాయణ హాజరవుతారని తెలిపారు. జిల్లా స్థాయిలో వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. అలాగే శాస్త్రీయం, జానపదం, దేశభక్తి నృత్యాలకు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. 5వ తరగతి వారు జూనియర్స్‌గా, 10వ తరగతి వరకు సీనియర్స్‌గా ఉంటారన్నారు. 9వ తేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో రోటరీ క్లబ్ కార్యదర్శి ముప్పూరి చలమయ్య, రోటరీక్లబ్ ప్రతినిధులు మన్నం నాగరాజు, గొల్లపూడి వెంకట్రావు, పోకూరి రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న చెరుకూరి రఘుకిరణ్

జబ్బు జేబులో డబ్బు

- అత్యంత ఖరీదుగా మారిన వైద్యం
- ఆదుకోనంటున్న ఎన్టీఆర్ వైద్యసేవ
- ఉన్నదంతా అమ్మి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న జనం



గ్రామీణ ప్రాంతాల్లో 65.6 శాతం మంది పేదలు, 68 శాతం మంది ధనికులు పొదుపు చేసుకున్న సొమ్మును వైద్య సేవల కోసమే ఖర్చు చేస్తున్నారు. అదే పట్టణ ప్రాంతాల్లో అయితే 68 శాతం మంది పేదలు, 80 శాతం మంది ధనికులు తమ ఆదాయంలో అధిక భాగాన్ని ఆస్పత్రులకు సమర్పించుకుంటున్నారు.

–సెంట్రల్ బ్యూరో ఆఫ్ హెల్త్ ఇంటిలిజెన్స్ –2017 నివేదిక

జిల్లాలో కూడా ఇదే పరిస్థితి. బ్యాంకుల్లో దాచుకున్న ఫిక్స్‌డ్ డిపాజిట్లను కూడా వైద్యానికే వాడుతున్నారు. చిన్న పాటి జ్వరాలకు కూడా ఆస్పత్రులు రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు ఖర్చు చేస్తుండటంతో విలవిల్లాడుతున్నారు.

పాప ఫలమో.. పుణ్య ఫలమో
జరిగిందేదో జరిగిపోయింది
మనిషై పుట్టాక బతగాలిగా!
ఈ జన్మలో ఎన్నో బంధాలు.. మరెన్నో బాధలు
అంతా బాగుండాలనుకుంటారు
అయితే అందరూ బాగుండలేరు
జ్వరం వస్తుంది.. జలుబు వస్తుంది
టైం బాగా లేకపోతే దీర్ఘకాలిక వ్యాధులు
ఒంట్లోకి.. ఇంట్లోకి చేరతాయి!
అయితే చదువులు.. పెళ్లిళ్లు.. పిల్లల సెటిల్‌మెంట్లు వదిలేసి..
ఆస్తులు అమ్మేసి ఆరోగ్యం కొనుక్కోవాల్సి వస్తోంది
ప్రభుత్వం మాత్రం ప్రజలను వాళ్ల ఖర్మకే వదిలేస్తోంది!

ఒంగోలు సెంట్రల్: గతంలో సంజీవనిగా పని చేసిన ఆరోగ్యశ్రీ పథకం ఇప్పుడు పేరు మార్చుకొని అనారోగ్యశ్రీగా మారిపోయింది. రాష్ట్ర విభజన అంటూ హైదరాబాద్‌కు లాక్ వేయడంతో తీవ్ర అనారోగ్య సమ్యలతో బాధపడుతున్నవారికి ఆంధ్రలో సరైన వైద్యం అందక మృత్యువాత కూడా పడుతున్నారు. జ్వరాలకు ఆరోగ్యశ్రీ, ఎంప్లాయిస్ హెల్త్ స్కీంలు వర్తించకపోవడంతో జేబులకు చిల్లులు పడుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 5000 డెంగీ అనుమానిత కేసులు నమోదయ్యాయి. మరో 25000 మందికి స్ట్రిప్ మెథడ్‌లో డెంగీ పాజిటివ్‌గా తేలింది. ఈ పద్ధతుల్లో బయట పరీక్షలు చేయించుకోవాలంటే రూ. 500 నుంచి రూ. 1000 వరకు వసూలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గుండె, కిడ్నీ వ్యాధులకు గురైనవారు చికిత్స కోసం ఆస్తులను అమ్ముకుంటున్నారు.

133 వ్యాధులను తొలగించారు

ప్రస్తుతం నెలకొన్న అనారోగ్యాన్ని సంరక్షించుకోవాలంటే సామాన్యులకు అయ్యే పని కాదు. దీనిని ప్రభుత్వమే చేపట్టాలి. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికీ వైద్యం అందించాలి. ఇలాంటి ప్రయత్నంలో భాగంగా గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరెడ్డి ఆరోగ్యశ్రీ ప్రవేశ పెట్టారు. దాదాపు 939 రోగాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చి ఉచిత వైద్యాన్ని అందరికీ అందించారు. కానీ నేటి ప్రభుత్వం సంకుచిత ధోరణితో ఉంది. ఈ పథకాన్ని ఎన్టీఆర్ వైద్యసేవగా మార్పు చేశారు. దాదాపు 133 వ్యాధులను ప్రైవేటు ఆసుపత్రుల నుంచి తప్పించి, ప్రభుత్వాసుపత్రులకు పరిమితం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ రోగాలకు నయం చేసే సదుపాయలు గానీ, నిపుణులైన వైద్యులు కానీ లేరు. దీంతో రోగులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయించి చేతి సొమ్ము వదిలించుకుంటున్నారు. ముఖ్యంగా అపెండిసైటిస్, గర్భ సంచి తొలగింపు, కణితుల తొలగింపు, న్యూరాలజీ, వెన్ను, పలు గైనిక్ సమస్యలను ప్రభుత్వ వైద్యశాలలకే పరిమితం చేశారు. ఏటా ప్రభుత్వ ఆసుపత్రులకు ఇస్తున్న మందుల బడ్జెట్‌ను కూడా సగానికి పైగా తగ్గించారు.

ఎక్సర్‌సైజ్‌లూ ఖరీదే

కొంత మంది ఎగువ మధ్య తరగతి, ధనిక వర్గాల వారు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ట్రెడ్‌మిల్లులు, ఆర్బిట్రెక్ట్ సైకిళ్లను కొనుగోలు చేసి ఇళ్లలోనే వాడుతున్నారు. ఇవి ఖరీదైనవి. ట్రెడ్‌మిల్ రూ. 25 వేల నుంచి రూ. 1లక్ష వరకు ఉంటుంది. కంప్యూటరైజ్డ్ అయితే రూ. 2 లక్షలకు పైగా ఉంటుంది. సైకిల్ అయితే రూ. 10 వేల నుంచి రూ. 35 వేల వరకు చెల్లించాలి. వీటిని కొనలేనివారు జిమ్‌లను, సమీపంలోని గ్రౌండ్‌లను ఆశ్రయిస్తున్నారు. జిమ్‌కు అయితే నెలకు రూ.1000 వరకు చెల్లించాల్సి వస్తుంది. ఇలా ఆరోగ్యం కోసం డబ్బు ఖర్చు చేయాల్సిందే.

రూ. 1 లక్ష అప్పు చేశాం



నా పేరు నక్కా చెన్నయ్య. వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నా. నా భార్య సాయమ్మకు కిడ్నీ జబ్బు సోకింది. వైద్యశాలలో చూపిస్తే రూ. 50 వేలు అయ్యాయి. అరోగ్య శ్రీ పథకం గురించి నాకు తెలియక పోవడంతో ప్రైవేటుగా చేయించాను. డాక్టర్లు మందులు వాడాలన్నారు. నెలకు రూ. 5 నుంచి రూ. 6 వేల దాకా అవుతున్నాయి. మూడు సంవత్సరాలుగా వాడుతున్నాం. నాకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఒక కుమారుడు, ఒక కుమార్తెకు వివాహం చేశాను. మిగిలిన ఇద్దరు కుమారులు, కుమార్తె, నా భార్య, నా అత్త అంతా నా సంపాదన మీదనే ఆధార పడి జీవిస్తున్నారు. ఒక ఎకరా పొలం ఉంది. మూడు సంవత్సరాలుగా వర్షాలు లేక పంటలు పండలేదు. కూలీ పనులు కూడా సరిగా ఉండటం లేదు. ఉపాధి హామీ పనులకు వెళితే రోజుకు రూ. 50 నుంచి రూ. 60 మాత్రమే వస్తున్నాయి. ఆ పనులు కూడా సరిగా ఉండటం లేదు. ఇతర కూలీ పనులకు వెళితే రోజుకు రూ. 150 దాకా వస్తాయి. దీంతో డబ్బు చాలక రూ. 1 లక్షకు పైగా అప్పు చేశాం.

– నక్కా చెన్నయ్య, చెన్నపునాయునిపల్లి, (సీఎస్‌పురం)

పెన్షనంతా మందులకే



శ్రీరాములు


యలమందమ్మ

గత సంవత్సరం ఆగస్టులో ఆరోగ్యశ్రీ ద్వారా గుండె శస్త్రచికిత్స చేయించుకున్నారు. అప్పటి నుంచి ఉచితంగా మందులు కూడా ఇచ్చారు. అయితే ప్రస్తుతం నిలిపివేశారు. నెలకు మందుల కోసం రూ. 2 వేలు అవుతున్నాయి. పెన్షన్ నుంచి నెలకు రూ. 90 కట్ చేస్తున్నా మందులు ఇవ్వడంలేదు. దీంతో డబ్బంతా ఖర్చు అవుతోంది. ఇతని ఊపిరితిత్తుల్లో నీరు చేరడంతో నెలకు మందుల కోసం అదనంగా రూ. 1000 వరకు ఖర్చు అవుతున్నాయి.

ఇతని భార్య యలమందమ్మ 2002 నుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. గుండె పెరిగిందని, వైద్యులు తెలిపారు. అప్పట్లో లక్ష రూపాయలు ఖర్చు చేశారు. వైద్యుని ఫీజుతో పాటు నెలకు రూ. 2 వేలు అవుతున్నాయి. ఇ.సి.జి, ఎకో వంటి పరీక్షలను నిర్వహిస్తే దాదాపు మరో రూ. 2 వేలు చెల్లిస్తున్నారు.

– ఈదర శ్రీరాములు (70), రిటైర్డ్ ఎంప్లాయి, ఒంగోలు



వైద్యం అందకుండా పోతోంది

ఈయనకు పన్నెండేళ్ల క్రితం గుండెల్లో నొప్పి వచ్చింది. ఆతరువాత బైపాస్ సర్జరీ చేశారు. ఆ సమయంలో లక్షా నలభై వేల రూపాయలు ఖర్చు అయ్యాయి. అప్పటి నుంచి మందులు వాడుతూనే ఉన్నాడు. గత ఏడాది వరకు నెలకు రూ. 900 అయ్యేవి. ఇప్పుడు నెలకు రూ.1500 అవుతున్నాయి. మందుల సంఖ్య తగ్గినా రేట్లు పెరిగాయి. బైపాస్ సర్జరీ కూడా రూ. 4 లక్షలవుతున్నాయి వైద్యం ఖరీదుగా మారింది.

– సయ్యద్‌బాషా సాహెబ్, ఉలవపాడు



Praja Sankalpa Yaatra

కొండంత ఓదార్పు



పెద్దమ్మకు ధైర్యం చెబుతున్న జగన్

పెద్ద దిక్కు నువ్వే



అవ్వ సమస్యను ఆలకిస్తూ..

సంతోషాల సెల్ఫీ



జగనన్నతో సెల్ఫీ

అన్న దీవెన



చిన్నారికి నామకరణం చేసి..
చెల్లెమ్మను ఆశీర్వదిస్తూ..



నవ సంకల్పం

నోటమాటరాని రైతులు
'పట్టు' తప్పుతున్న అన్నదాతలు
అప్పుల కుంపటిలో అక్కాచెల్లెమ్మలు
వైద్యానికి దూరమవుతున్న బడుగు జీవులు
పింఛన్ కోసం ఎదురు చూస్తున్న అవ్వాతాతలు..
కరువు నేలపై కంటికి కన్పించే దృశ్యాలు.



కొత్త ఏడాది సరికొత్తగా ఉండాలని..
సమస్యలన్నీ సమసిపోవాలని..
కర్షకుల కష్టాలు తొలగిపోవాలని..
రాజన్న కలలు నెరవేరాలని..
నవ సంకల్పంతో అడుగులేస్తున్న జగనన్నకు జనం బ్రహ్మరథం పట్టారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా మూడో రోజు ఆదివారం జననేతకు తంబళ్లపల్లె నీరాజనం పలికింది.



అన్నయ్య దీవెన : చెల్లెమ్మలను ఆప్యాయంగా పలకరిస్తున్న జగనన్న

చిట్టి తల్లికి నామకరణం



చిన్నారికి విజయమ్మ అని నామక
వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



సంఘ మిత్రల సమస్యలు వింటూ..

కొండంత ఆసరా..



అవ్వా.. మీ వెంటే ఉంటా..

జగనానందం



జగన్‌ను చూసేందుకు మేడలెక్కిన అభిమానులు





ఆరోగ్యంపై ఆరా



కన్నీళ్లు తుడుస్తూ..

భవిష్యత్‌కు భరోసా



రాజన్న బిడ్డను చూసి ఆనందం

ఆప్యాయతకు అండ



కష్టాలు వింటూ ..

విరిసి..మురిసి

పూల బాటలో పాదయాత్ర







అన్నయ్యతో చెల్లెమ్మలు



నిఘా నీడ : డ్రోన్ కెమెరాలతో పరిశీలన

...రణం చేస్తున్న





మహా నివాళి: వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించేందుకు వెళుతున్న జగన్‌మోహన్ రెడ్డి

ఓటేయలేదని..



'అయ్యా.. రెండేళ్ల క్రితం నాకు యాక్సిడెంట్ అయ్యి కాలు విరిగింది. ఆస్పత్రికి వెళితే కాలు తీసేసినారు. తిండి కూడా లేకుండా అల్లాడతా ఉండా. పింఛన్ కోసం రెండుసార్లు జన్మభూమిలో కాగితాలిచ్చినా. ఓసారి పేరు కూడా వచ్చింది. కానీ నేను టీడీపీ వాడిని కాదని పింఛన్ ఆపేసినారు' అంటూ తంబళ్లపల్లెలోని రేణిమాకులపల్లెకు చెందిన జబ్బార్ వాపోయాడు. మీరే న్యాయం చేయాలంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభ్యర్థించాడు. రేణిమాకులపల్లెకు చెందిన 48 ఏళ్ల మహబూబ్‌బాషా మాట్లాడుతూ తనకు పుట్టిన కొన్నాళ్లకే రెండు కాళ్లూ పనిచేయడం మానేశాయని, పింఛన్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నట్లు వాపోయాడు. – చిత్తూరు అర్బన్

'పట్టు'తప్పుతున్నాం!



'పక్కనున్న కర్ణాటక రాష్ట్రంలో పట్టు రైతులకు గవర్నమెంటు మంచి ఇన్‌సెంటివ్ ఇస్తా ఉండాది. మన ప్రభుత్వం ఏమీ పట్టించుకోవడం లేదు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఏటా ఆరు పంటలు వేస్తా ఉండాం. ఎప్పుడూ రైతు అడిగిన ధర ఇవ్వలేదు. పట్టు గూళ్లు అమ్మితే.. కష్టం కూడా దక్కేదిలేదు. మీరు పెద్ద మనసు చేసుకుని పట్టుగూళ్లకు రూ.వంద ఇన్‌సెంటివ్ ఇస్తే మాబోటి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది..' అంటూ ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డిని మదనపల్లె కోళ్లబైలుకు చెందిన అక్కుల్‌రెడ్డి కోరారు. – చిత్తూరు అర్బన్

ప్రశ్నిస్తే అరెస్టులు



'అన్నా.. 18 ఏళ్లుగా వెలుగు పథకంలో పనిచేస్తున్నాం. ఇప్పుడు సంఘమిత్రలుగా ఉన్నాం. ప్రభుత్వం చేపట్టే ప్రతి ఒక్క పనినీ ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం. ప్రతి పల్లెకూ తిరుగుతున్నాం. కానీ మాకిచ్చేది నెలకు రూ.1,250లే. అది కూడా గ్రామ సంఘం నుంచి తీసుకోమంటా ఉండారు. కనీసం ఉద్యోగ భద్రత లేదు. దానిక్కూడా బాధ లేదు. మమ్మల్ని మనుషులుగా గుర్తిస్తేచాలు. మా డిమాండ్లపై ప్రభుత్వాన్ని నిలదీద్దీమన్నా.. ధర్నా చేద్దామనుకున్నా వెంటనే అరెస్టు చేసేస్తా ఉండారు. ఇదేం పద్ధతన్నా' అంటూ తంబళ్లపల్లె మండలం ఎర్రసానిపల్లెకు చెందిన మహిళలు ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. సంఘమిత్ర వ్యవస్థను పటిష్టం చేయాలని, నెలకు రూ.15 వేల వేతనం ఇవ్వాలని కోరారు. – చిత్తూరు అర్బన్

బాబు మోసం



'డ్వాక్రా రుణాల మాఫీ పేరిట సీఎం చంద్రబాబు మహిళా లోకాన్ని మోసం చేశారు. ఇప్పుడు పసుపు కుంకుమ పేరుతో మూడు వేల రూపాయలిచ్చి, అదికూడా అకౌంట్లో నుంచి డ్రా చేసుకోకూడదని ఆంక్షలు పెట్టారు. పావలా వడ్డీ కూడా రద్దు చేయలేదు. వాటిపై రూ.1.5 పైసలు వడ్డీ కడుతున్నాం' అంటూ జల్లావారిపల్లెకు చెందిన గణేష్ మహిళా సంఘ సభ్యురాలు సరస్వతమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదయాత్రలో పాల్గొన్న మహిళలు జగన్‌మోహన్ రెడ్డికి కష్టాలు తెలియజేశారు. – తంబళ్లపల్లె

14న రాష్ట్ర స్థాయి బండలాగుడు పందేలు

పాపినేనిపల్లె (అర్ధవీడు): అవధూత రామయోగి తాత పంచమ వార్షికోత్సం తిరునాళ్ల సందర్భంగా మండలంలోని పాపినేనిపల్లెలో జనవరి 14న రాష్ట్ర స్థాయి బండలాగుడు పందాలు నిర్వహిస్తున్నట్లు తిరునాళ్ల కమిటీ పెద్దలు తెలిపారు. మొదటి బహుమతిగా రూ. 50 వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 30 వేలు, రూ. 20 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 13వ తేదీ రూ. 500 రుసుం చెల్లించి నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

కంది'పప్పు ఉడకనంటోంది'

- శనగపప్పును తలపిస్తున్న కందిపప్పు
- ఉడకబెట్టడానికే సరిపోతున్న గ్యాస్
- గుడ్లు తేలేస్తున్న అంగన్‌వాడీలు



అంగన్‌వాడీ కేంద్రాలకు ఇటీవల అందించిన పెద్ద సైజులో ఉన్న కందిపప్పు

ఒంగోలు టౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం కింద సరఫరా చేసే నిత్యావసర సరుకుల్లో క్వాలిటీకి ప్రభుత్వం పూర్తిగా తిలోదకాలు ఇచ్చేసింది. నాసిరకం నిత్యావసర సరుకులు అందిస్తుండటంతో వాటిని పౌష్టికాహారం కింద తీసుకోలేక గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలవుతున్న అన్న అమృత హస్తం కింద అందిస్తున్న నిత్యావసర సరుకుల్లో నాసిరకం శాతం పెరిగిపోతోంది. తాజాగా అందించిన కందిపప్పులో నాసిరకం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఆ కందిపప్పు బూజుపట్టి పెద్ద సైజులో ఉండటంతో వాటిని ఉడకబెట్టేసరికి అంగన్‌వాడీలు గుడ్లు తేలేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే గ్యాస్ సిలిండర్లలో సగం కందిపప్పు ఉడకబెట్టడానికే సరిపోతోందని అంగన్‌వాడీలు వాపోతున్నారు. ఇక బియ్యం, కూరగాయలను ఏవిధంగా వండాలి, వాటితోపాటు కోడిగుడ్లు ఎలా ఉడకబెట్టాలని అనేకమంది అంగన్‌వాడీలు సూపర్‌వైజర్లు, సీడీపీఓల వద్ద ఏకరువు పెడుతున్నారు. జిల్లా మహిళా శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు పరిధిలో 21 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఆ ప్రాజెక్టుల పరిధిలో 4244 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో అన్న అమృతహస్తం పథకాన్ని అమలుచేస్తున్నారు. ఈ పథకం కింద గర్భిణులు, బాలింతలకు మధ్యాహ్నం పూట పౌష్టికాహారం కింద భోజనం వండి పెడుతున్నారు. 2017 జులై వరకు జిల్లాలోని ఆరు ఐసీడీఎస్ ప్రాజెక్టులను పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసి అన్న అమృతహస్తం పథకాన్ని ప్రారంభించారు. అనంతరం మిగతా 15 ప్రాజెక్టుల్లో కూడా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలోని 4244 అంగన్‌వాడీ కేంద్రాల్లో దాదాపు 28 వేల మంది గర్భిణులు, 25 వేల మంది బాలింతలు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరందరికీ ఆదివారం, ఇతర పండుగ రోజులను మినహాయించి మిగిలిన రోజులంతా అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనాన్ని వండి పెట్టాల్సి ఉంటుంది.

ఆరు నెలల నుంచి గ్యాస్ బిల్లులు లేవు

గతంలో ఎన్నడూ లేనివిధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృతహస్తం పథకాన్ని అమలు చేస్తుండటంతో మధ్యాహ్న భోజనానికి గ్యాస్ సిలిండర్ల వినియోగం పెరిగిపోయింది. 2017 జూన్ నుంచి గ్యాస్ బిల్లులు నిలిచిపోయాయి. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి నెలకు రమారమీ ఒక సిలిండర్ ఖర్చవుతోంది. దాదాపు ఆరు నెలల నుంచి గ్యాస్ బిల్లులు నిలిచిపోవడంతో అంగన్‌వాడీలు తమ సొంత డబ్బులతో ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో శనగపప్పును తలపించే విధంగా కందిపప్పు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయడంతో గ్యాస్ వినియోగంలో ఎక్కువ భాగం కందిపప్పును ఉడకబెట్టేందుకే సరిపోతోందని అంగన్‌వాడీలు వాపోతున్నారు. అసలే ఆరునెలల నుంచి గ్యాస్ బిల్లులు రాలేదని, ఇప్పుడు ఈ కందిపప్పును ఉడకబెడుతుండటంతో గ్యాస్ సిలిండర్ ఎప్పుడు అయిపోతుందోనన్న ఆందోళన వారిని పట్టిపీడిస్తోంది. గర్భిణులు, బాలింతలకు అందించే మధ్యాహ్న భోజనంలో కచ్చితంగా కందిపప్పు పెట్టాలన్న ఆదేశాలు ఉండటంతో అంగన్‌వాడీలు ఆందోళన చెందుతున్నారు. పెద్ద కందిపప్పు స్థానంలో నాణ్యమైన చిన్న కందిపప్పు వచ్చేవరకు తమకు ఈ కష్టాలు తప్పేలా లేవని అంగన్‌వాడీలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ స్పందించి నాణ్యమైన కందిపప్పు కేంద్రాలకు తెప్పించే ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు.

కొసమెరుపు

అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం కింద అందించే కోడి గుడ్లు గోలీ సైజులో చిన్నగా ఉండగా, కందిపప్పు మాత్రం శనగపప్పు సైజులో పెద్దగా ఉండటం గమనార్హం. ఒకదానికి బదులు మరొక సైజు నిత్యావసరాలను టెండర్‌దారులు సరఫరా చేస్తున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ వారు లైట్‌గానే తీసుకుంటున్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయండి

– మంత్రి శిద్దా రాఘవరావు



మాట్లాడుతున్న మంత్రి శిద్దా

దర్శి: జన్మభూమి – మా ఊరు కార్యక్రమంలో భాగంగా మోడల్ స్కూల్‌లో జరిగే ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర అటవీ,పర్యావరణ, శాస్త్రసాంకేతిక శాఖ మంత్రి శిద్దా రాఘవరావు కోరారు. స్థానిక మంత్రి కార్యాలయంలో విలేకర్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన వివరాలు తెలియజేశారు. 12గంటలకు ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో బయల్దేరి 12.45గంటలకు దర్శికి చేరుకుంటారు. 12.50 గంటలకు జేవీఎంవీ కల్చరల్ ప్రోగ్రాంలో పాల్గొంటారు. 1 గంటకు సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించి 1.10కి మోడల్ స్కూల్ గ్రౌండ్‌లోని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తారు. 2 గంటల వరకు వివిధ రకాల అభివృద్ధి పథకాలను పరిశీలన అనంతరం 2 నుంచి 4:30 గంటల వరకు జన్మభూమి– మా ఊరు కార్యక్రమం జరుగుతుందని మంత్రి తెలిపారు. కలెక్టర్ వినయ్‌చంద్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు 30 పోలీస్ యాక్టు అమలు

ఒంగోలు క్రైం: ఒంగోలు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో 2018 జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని ఒంగోలు డీఎస్పీ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ చట్టం ప్రకారం నిషేధాజ్ఞలు విధించటమైనదని పేర్కొన్నారు. ఒంగోలు సబ్‌డివిజన్ పరిధిలో ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించదలచినా, మైకులు, లౌడ్‌స్పీకర్లు ఉపయోగించాలన్నా, బాణాసంచా కాల్చాలన్నా పోలీస్ శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి తీసుకోకుండా నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబ్‌డివిజన్ పరిధిలోని ఒంగోలు వన్‌టౌన్, టూటౌన్, తాలూకా, కొత్తపట్నం, ఒంగోలు రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలోని చీమకుర్తి, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు, సింగరాయకొండ పోలీస్ సర్కిల్ పరిధిలోని సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. వివాహ ఊరేగింపులు, అంతిమయాత్రలను ఈ ఉత్తర్వుల నుంచి మినహాయించినట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ శాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సంస్థలు, ప్రజలు సహృదయంతో అర్థం చేసుకోవాలని పోలీసులు కోరారు.

వేసవి ఉల్లిసాగుకు అదును ఇదే..!

ఒంగోలు టూటౌన్: ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు. ఉల్లి అంత ఆరోగ్యదాయని ఏదీ లేదు. కొద్దిపాటి నీటి తడులతో ఉల్లిసాగు చేసుకుంటే మంచి లాభాలు ఆర్జించవచ్చు. ఉల్లి పంట ఏడాదికేడాదికీ తగ్గుముఖం పడుతుండటంతో వాటి ధరలు గత యేడాది ఆకాశన్నంటాయి. ప్రస్తుతం ధర అందుబాటులో ఉన్నా.. రానున్న రోజుల్లో మరింత ధర పెరిగే అవకాశం ఉంది. వేసవి ఉల్లిసాగులో మెళుకువలు పాటిస్తే దిగుబడులు సాధించవచ్చునని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు సూచించారు. వేసవిలో తీసుకోవాల్సిన సూచనలు, మెళుకువల గురించి పలు విషయాలు వివరించారు.

విత్తే సమయం, నేలలు:

ఉల్లిని వేసవి పంటగా జనవరి-మార్చి నెలల్లో సాగు చేసుకోవచ్చు. వాతావరణంలో పెద్దగా మార్పులేని ప్రాంతాలలో ఎదుగుదల బాగుంటుంది. నీరు నిలవని సారవంతమైన ఎర్రనేలలు, ఒండ్రునేలలు ఈ పంట సాగుకు అనుకూలంగా ఉంటాయి. ఉప్పు, చౌడు, ఏటవాలు నేలలు నీరు నిల్వ ఉండే నేలలు పనికిరావు. జిల్లాలో తీరప్రాంతంలో సాగు చేయవచ్చు. ఎక్కువగా యర్రగొండపాలెం పరిసర ప్రాంత్రాల్లో సాగు చేసేందుకు నేలలు అనుకూలంగా ఉన్నాయి.

విత్తన రకాలు:

ఆర్కకల్యాణ్, రాంపూర్ రెడ్, పూసా రెడ్, బళ్ళారి రెడ్, ఆర్కనికేతన్, ఆర్కకళ్యాణ్ పాయలు 110 నుంచి 180 గ్రాముల వరకు బరువు ఉంటాయి. ఎకరానికి 132 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. రాంపూర్‌రెడ్ అయితే పాయలు పెద్దవిగా ఉండి ఘాటుతో పాటు నిల్వ నాణ్యతతో ఉంటుంది. దిగుబడి 100 క్వింటాళ్ళ వరకు వస్తుంది. గడ్డలు తెల్లగా ఉంటాయి. పూసరెడ్ అయితే పాయలు ఎరుపు రంగులో మధ్యస్థంగా 70 నుంచి 90 గ్రాముల బరువు ఉంటాయి. ఘాటూతో పాటు నిల్వ నాణ్యత ఉంటుంది. ఆర్కనికేతన్ అయితే పాయలు ఎరుపు రంగుతో 100 నుంచి 180 గ్రాముల బరువు ఉంటాయి. నిల్వ నాణ్యత ఎక్కువగా ఉంటుంది. ఎకరానికి దిగుబడి 130 క్వింటాళ్ల వరకు వస్తుంది. బళ్ళారిరెడ్ అయితే పాయలు పెద్దగా ఉండి ఒకటి లేదా రెండు కలిసి ఉంటాయి. ఘాటు తక్కువగా ఉంటుంది.



ఉల్లి పంట

విత్తనశుద్ధి:

మూడు గ్రాముల కాప్లన్ లేదా థైరమ్ కిలో విత్తనానికి సరిపోతుంది. నారుమడిలో విత్తనాన్ని పలుచగా వరుసల్లో పోయాలి. నారుకుళ్ళు తెగులు సోకుండా 10 రోజులకు ఒకసారి కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. నారు పెరిగే దశలో రసం పీల్చే పురుగు ఆశించకుండా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు నారుమడిలో చల్లి నీరు కట్టాలి.

నారు పెంచడం:

నేలను బాగా దున్ని 120 మీటర్ల వెడల్పు, 3 మీటర్ల పొడవుగల ఎత్తయిన నారుమళ్ళను తయారు చేయడానికి 2-2.5 కిలోల విత్తనాన్ని 200-250 చదరపు మీటర్ల నారుమడిలో పెంచిన నారు ఒక ఎకరంలో నాటడానికి సరిపోతుంది. విత్తనాలు 5 నుంచి 8 రోజుల్లో మొలకెత్తుతాయి. మురుగు నీరు బయటకు పారదోలేందుకు కాలువలు తీయాలి. పశువుల ఎరువు వేసి బాగా నారుమడిని దున్నాలి. ఒకటిన్నర మీటర్ల వెడల్పు, మూడున్నర మీటర్ల పొడవు, 15 సెంటీమీటర్ల ఎత్తు ఉండేలా 8 సెంటీమీటర్ల ఎడం ఉండేలా 2-3 సెంటీమీటర్ల లోతుగా విత్తనాలు వేసుకోవాలి. నారుమడిలో తడి ఆరకుండా చూసుకోవాలి. 13 గ్రాములు కాప్టాన్ లేదా థైరామ్‌ను కిలో విత్తనానికి కలిపి నారుమడిలో విత్తనాన్ని పలుచగా వరుసల్లో పోయాలి. నారు తెగులు సోకకుండా 10 రోజులకొకసారి కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. నారు పెరుగుదల దశలో రసం పీల్చు పురుగు ఆశించకుండా కార్బోఫ్యూరాన్ గుళికలు నారుమడిలో చల్లాలి. మొలకెత్తిన 4 నుంచి 5 వారాల్లో ప్రధాన పొలంలో నాటాలి.

నారు నాటడం:

2-3 సార్లు దుక్కిదున్ని పొలాన్ని చదును చేయాలి. బోదేలు 30 సెంటీమీటర్ల ఎండలో వేసి బోదెకు రెండు వైపులా నాటుకోవాలి. నారును 1 శాతం బోర్లో మిశ్రమంలో ముంచి నాటడం వల్ల నారుకుళ్లు సోకుండా ఉంటుంది.

ఎరువులు:

ఎకరాకు 10 టన్నుల పశువు ఎరువుతో పాటు 60-80 కిలోల నత్రజని, 24-32 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. వేరుశనగ పిండి లేదా ఆముదం పిండి వేసి గొయ్యితవ్వి మట్టిని ఎగదోయడం వల్ల ఎక్కువ దిగుబడి వస్తుంది. నత్రజనిని రెండు దఫాలుగా నాటినప్పుడు, నాటిన 30 రోజుల తర్వాత వేసుకోవాలి. నత్రజనితోపాటు పొటాష్‌ను రెండు దఫాలుగా వేసుకుంటే గడ్డ బాగా ఊరుతుంది.

నీటియాజమాన్యం:

నాటిన 60 రోజుల వరకు 12 నుంచి 15 రోజుల వ్యవధితో 4-5 తడులు ఇవ్వాలి. గడ్డ ఊరే దశలో 6-7 రోజుల వ్యవధితో 7-8 తడులు ఇవ్వాలి. కోతకు 15 రోజుల ముందు నీరు కట్టుట ఆపాలి. నీటి తడులు లేత మొక్కలకు తక్కువగా ఊరే దశలో ఎక్కువగా ఉంటుంది. గడ్డలు తవ్వకానికి వారం రోజుల ముందు నీటితడులను నిలిపివేయాలి. నాటిన మూడు వారాల నుంచి పంటలో కలుపు తీయాలి.

కలుపు నివారణ - అంతరకృషి :

నాటే ముందు పెండిమిథాలిన్ 30 శాతం ఎకరాకు 1.3 నుంచి 1.6 లీటర్ల లేదా ఆక్సిపోరోఫిన్ 23.5 శాతం 200 మిల్లీలీటర్లు చొప్పున ఏదో ఒక దానికి నాటే ముందు పిచికారి చేయాలి. లేదా నాటిన 2, 3 రోజుల్లో తేమ ఉన్నప్పుడు ఎకరాకు ఆక్సీఫ్లోరోఫిన్ 23.5 శాతం 200 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. నాటిన 30, 45 రోజుల మధ్య మరాల కలుపు తీసి మట్టి ఎగదోయాలి. నారు నాటిన 75 రోజులకు మాలిక్ మైద్రజెడ్ 0.25 (2.5 గ్రాముల లీటరు నీటికి) ద్రావణాన్ని చల్లడం వల్ల ఉల్లిగడ్డ మొలకెత్తడం వల్ల కలిగే నష్టం బాగా తగ్గుతుంది. నారు నాటిన 100-110 రోజులకు 1 గ్రాము కార్బండిజమ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఇలా చేయడం వలన నిల్వలో ఉల్లికుళ్ళడం చాల వరకు తగ్గుతుంది.

సమగ్ర సస్యరక్షణ:

ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేయాలి. ఎకరాకు 80 కిలోల చొప్పున వేపపిండిని వేయడం వల్ల నులిపురుగులు, నేలలో ఉన్న శిలీంద్రాలు నాశనం అవుతాయి. పొలంలో అక్కడక్కడ పసుపురంగు పూసిన డబ్బాలు ఎకరానికి 2 చొప్పున పెట్టాలి. దీనివల్ల రసంపీల్చు పురుగులు ఆకర్షించబడతాయి. కిలో విత్తనానికి 8 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి లేదా 3 గ్రాములు థైరామ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. పెరుగుదల దశలో పురుగుల నివారణకు 5 శాతం వేపగింజల ద్రావణాన్ని పిచికారి చేయాలి. తామర పురుగులు ఆకుల అడుగు భాగానచేరి రసాన్ని పీల్చి వేయడం వల్ల తెల్లటి మచ్చలు ఏర్పడతాయి. దానితోపాటుగా ఆకులు, కాడలపై ఊదారంగు మచ్చలు కూడ ఏర్పడతాయి. వీటి నివారణకు డైమిథోయేట్ లేదా ఫిఫ్రొనిల్ 2 మిల్లీలీటర్లు మరియు మాంకోజెబ్ 3 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు, మూడుసార్లు పిచికారి చేయాలి. ఉల్లిలో ఆకు తినే పచ్చ పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

నేటి నుంచి బయోమెట్రిక్ అమలు

ఒంగోలు టూటౌన్: జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో సమయపాలన, పారదర్శికత పాటించేందుకు సోమవారం నుంచి బయోమెట్రిక్ అమలు కానుంది. ఎక్కువ మంది గ్రామ కార్యదర్శిలు పంచాయతీలకు వెళ్ళకపోవడం, ఒకవేళ వెళ్లినా సమయపాలన లేకుండా పోవడం, అసలు ఎక్కడుంటారో తెలియకపోవడం వంటి విమర్శలు వెల్లువెత్తుతుండటంతో ప్రభుత్వం బయోమెట్రిక్ విధానం తీసుకొచ్చింది. దీని ద్వారా పారదర్శికత, సమయపాలన తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 1030 గ్రామపంచాయతీలు ఉండగా అంతే స్థాయిలో గ్రామకార్యదర్శిలు లేకపోవడంతో రెండు, మూడు గ్రామపంచాయతీలను కలిపి క్లస్టర్లుగా ఏర్పాటు చేశారు. క్లస్టర్ల వారీగా మొత్తం 462 మంది గ్రామ కార్యదర్శిలు ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే వీరిలో సమయపాలన తెచ్చేందుకు పంచాయతీరాజ్ వ్యవస్థ సంస్కరణల్లో భాగంగా బయోమెట్రిక్‌ను నేటి నుంచి అమలు చేయనున్నారని పంచాయతీ వర్గాలు తెలిపాయి. దీంతో సోమవారం నుంచి గ్రామ కార్యదర్శిలు బయోమెట్రిక్ అమలు చేసిన క్లస్టర్ గ్రామపంచాయతీకి ఉదయం 10.30 వెళ్ళి బయోమెట్రిక్ యంత్రంలో వేలిముద్ర వేయాల్సి ఉంది. మళ్లీ సాయంత్రం 5 గంటలకు వేలిముద్ర వేయాల్సి ఉంది. ముందు క్లస్టర్ల గ్రామపంచాయతీల్లో బయోమెట్రిక్ అమలు చేసిన దానిని జిల్లా పంచాయతీ కార్యాలయానికి అనుసంధానం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బయోమెట్రిక్ ఆధారంగానే కార్యదర్శిలకు జీతాల చెల్లింపులు జరగనున్నాయని సమాచారం. ఒకటికల్లా అన్ని గ్రామపంచాయతీల్లో బయోమెట్రిక్ అమలు చేయాలని రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఇటీవల జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశాలు వచ్చాయి. పంచాయతీల్లో బయోమెట్రిక్ అమలకు గత వారం కిందట డీఎల్‌పీఓలు, ఈఓఆర్‌డీలతో జిల్లా పంచాయతీ అధికారి సమీక్షా సమావేశం కూడా నిర్వహించారు.

ఇతర శాఖల్లో అమలు...

గ్రామపంచాయతీల్లోనే కాకుండా ప్రభుత్వం జిల్లాలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో బయోమెట్రిక్ యంత్రాలు అమలు చేయాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు ఆదేశించడం జరిగింది. ఇటీవల జిల్లాకు వచ్చిన ఆయన జిల్లా మార్కెంటింగ్ శాఖ కార్యాలయంలో ఏఎంసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పారదర్శికత తీసుకువచ్చేందుకు బయోమెట్రిక్ తప్పని సరి చేయాల్సి వస్తోందని తెలిపారు. అదే విధంగా జిల్లా పశు సంవర్ధకశాఖలో కూడా బయోమెట్రిక్ విధానం అమలును ప్రభుత్వం తీసుకువచ్చింది. ముందుగా ఏడీ క్యాడర్ వైద్యశాఖల్లో ఇటీవల ప్రారంభించారు. ప్రభుత్వం మార్గదర్శికాల ప్రకారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు వైద్య సిబ్బంది సేవలు అందించాల్సి ఉంది. అయితే ఉదయం మాత్రమే పనిచేసి మధ్యాహ్నం నుంచి పశుపోషకులకు అందుబాటులో లేకుండా పోతుండటంతో ప్రభుత్వం బయోమెట్రిక్ విధానం అమలు చేస్తోంది.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు టూటౌన్:

జిల్లాలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ డీఎం లక్ష్మి తయారమ్మ తెలిపారు. మేదరమెట్ల, మార్టూరు, త్రిపురాంతకం, గిద్దలూరు, వ్యవసాయ మార్కెట్‌యార్డులలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1, 237 క్వింటాళ్లను కొనుగోలు చేశామని, మొత్తం 1, 727 హెక్టార్లలో మొక్కజొన్న సాగయినట్లు తెలిపారు. బయట మార్కెట్లో మొక్కజొన్నకు కనీస మద్దతు లేకపోవడం వలన ప్రభుత్వం మార్క్‌ఫెడ్ నోడల్ ఏజెన్సీ ద్వారా రైతుల వద్ద రూ.1, 425 కొనుగోలు చేస్తోందని తెలిపారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా బాగా ఎండబెట్టిన మొక్కజొన్నను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. జల్లెడ పట్టి శుభ్రం చేసిన మొక్కజొన్నలను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.

ప్రభుత్వ ఎక్స్‌రే టెక్నీషియన్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు సెంట్రల్:

ఏపీ ప్రభుత్వ ఎక్స్‌రే టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. స్థానిక రిమ్స్ వైద్యశాలలోని రేడియాలజీ విభాగంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎ చెన్నకేశవరెడ్డి, జిల్లా కార్యధర్శిగా సీహెచ్ చక్రవర్తి, కొశాధికారిగా వి. నాగరాజు, ఇతరులు ఎన్నికైయ్యారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి పరిశీలకుడిగా రాష్ట్ర సంఘ తాత్కాలిక అధ్యక్షుడు ఎన్. పాండురంగారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఎక్స్‌రే టెక్నీషియన్స్ పాల్గొన్నారు.



ఎంపికైన నూతన కార్యవర్గం

'స్వచ్ఛ ఒంగోలు' కవితా సంకలనానికి కవితల ఆహ్వానం

ఒంగోలు కల్చరల్:

'వన్ గోల్..స్వచ్ఛ ఒంగోలు' అనే అంశంపై కవితా సంకలనాన్ని వెలువరించనున్నట్లు జిల్లా ముస్లిం రచయితల సంఘం అధ్యక్షుడు షేక్ మహబూబ్ జాన్ ఆదివారం వెల్లడించారు. కవులు 25 పంక్తులకు మించని కవితలను జనవరి 10లోగా షేక్ మహబూబ్ జాన్, అధ్యక్షుడు, జిల్లా ముస్లిం రచయితల సంఘం, ఇంటి నంబర్19-3-13, కోట వీధి, ఒంగోలు, పిన్ 523001 అనే చిరునామాకు పంపించాలి. వివరాలకు 9959950191 నంబరను సంప్రదించాలని తెలిపారు. కవులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

ఒంగోలు కల్చరల్: స్థానిక ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం వెంకటేశ్వరస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు అందచేశారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ

ఒంగోలు సబర్బన్: ఏపీ చిన్న పత్రికల ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సరం -2018 క్యాలెండర్‌ను ఎస్పీ బి.సత్య ఏసుబాబు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకపాటి మాల్యాద్రి, పల్లాటి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మక్కెన గోపి, బంగి లింగరాజు, గద్దల శివాజీ, జి.బాబూరావు,సి.హెచ్.రమేష్ పాల్గొన్నారు.

మా రికార్డులు మాకున్నాయ్..!

- సంచలన కేసులను వేగంగా ఛేదించాం..
- చోరీ కేసుల్లో అత్యధికంగా రికవరీ
- జిల్లా పోలీసు అధికారులకు ఏ గ్రేడ్, సి గ్రేడ్‌లు
- సిబ్బంది ఉత్సాహంగా పనిచేసేందుకు ఉపయోగపడిన 'వారధి'
- మేలుకొలుపు కార్యక్రమం ద్వారా ప్రజల్లో నేరాలపై అవగాహన
- గతేడాదిలో జరిగిన నేరాలపై మాట్లాడిన ఎస్పీ బి.సత్యఏసుబాబు



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ సత్య ఏసుబాబు, పక్కన ఏఎస్పీ ఉదయరాణి, డీసీఆర్‌బీ డీఎస్పీ

ఒంగోలు క్రైం: జిల్లాలో సంచలనం రేకెత్తించిన కేసులను అత్యంత వేగంగా ఛేదించి ఉన్నతాధికారుల నుంచి అత్యుత్తమ గుర్తింపు దక్కించుకున్నామని ఎస్పీ బూసరపు సత్య ఏసుబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని ఐటి కోర్ సెంటర్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గతేడాదిలో జరిగిన నేరాలు, పోలీసు శాఖ సాధించిన ఫలితాల గురించి ఆయన విశ్లేషించారు. కేసులను ఛేదించడంలో తమ సిబ్బంది చూపిన చొరవ, తెలివి తేటలను కొనియాడారు. అత్యంత నేర పూరిత ఆలోచనలతో చేసిన నేరాలను సైతం చాకచక్యంగా ఛేదించి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని విపులీకరించారు.

చిన్నారి కేసును ఛేదించినందుకు ఏ–గ్రేడ్

ఐదేళ్ల చిన్నారిని పీసీపల్లి మండలంలో అత్యాచారం చేసి చివరకు హత్య చేసిన కిరాతకుడిని ఎలాంటి ఆధారాలు లేకున్నా అత్యంత వేగంగా దర్యాప్తు పూర్తి చేసినందుకు జిల్లాకు ఏ–గ్రేడ్ దక్కిందని, పర్చూరులో ఏటీఎం నుంచి నగదు తీసుకెళ్తున్న వ్యక్తిని గమనించి నగదు అపహరించిన ఒడిశాకు చెందిన నేరస్తుడిని పర్చూరు ఎస్‌ఐ పట్టుకుని కటకటాల వెనక్కి నెట్టినందుకు రాష్ట్రంలోనే సి–గ్రేడ్ దక్కిందని పేర్కొన్నారు. వీటితో పాటు వేమవరం జంట హత్యల కేసు, అద్దంకిలో 234 కేజీల గంజాయి పట్టివేత, ఒంగోలులో దంపతుల హత్య, గుప్త నిధుల తవ్వకాలు, ఒంగోలులో రూ.3 కోట్ల భారీ దొంగతనం, కారులో బంగారు ఆభరణాల కేసు, నకిలీ ఏటీఎంల ద్వారా మోసం, కందుకూరు ప్రాంతంలో వృద్ధ మహిళలను హత్య చేసిన కేసులను అత్యంత వేగంగా ఛేదించి సంచలనాలను తిరగరాశామని హర్షం వ్యక్తం చేశారు. గతేడాదిలో 97 భారీ దొంగతనాలు జరగగా 81 కేసుల్లో రికవరీ చేశామని వివరించారు. మొత్తం రూ.5.17 కోట్ల విలువైన ఆభరణాలు, నగదు అపహరణకు గురికాగా రూ.3.44 కోట్లు రకవరీ చేశామని ఎస్పీ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య తగ్గడంపై హర్షం

రోడ్డు ప్రమాదాల్లో మరణాలు తగ్గించగలిగామని ఎస్పీ సంతోషంవ్యక్తం చేశారు. 2016తో పోలిస్తే 17లో వాహనాల సంఖ్య 10 నుంచి 15 శాతం పెరిగిందని, అందుకు తగ్గట్టుగా ప్రమాదాల సంఖ్య కూడా పెరిగిందని చెప్పారు. 9 శాతం మరణాలను తగ్గించగలిగామని వివరించారు. మద్యం తాగి వాహనాలు నడిపి, లేక డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమై మరణాలు సంభవిస్తే కఠినమైన శిక్ష పడేలా సెక్షన్లు మార్చినట్లు పేర్కొన్నారు. పేకాట, సింగిల్ నంబర్ ఆటలపై దాడులు నిర్వహించి 2,902 కేసులు నమోదు చేసి రూ.61.17 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. డ్రంకన్ డ్రైవ్ కేసులు 11,023 నమోదు చేసి రూ.84.47 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. అందులో భాగంగా 594 మందికి జైలుశిక్ష కూడా విధించినట్లు చెప్పారు. మోటారు వెహికల్ చట్టం కింద నిబంధనలు అతిక్రమించిన వారిపై 1,29,166 కేసులు నమోదు చేసి రూ.2.80 కోట్ల అపరాధ రుసుం విధించినట్లు వివరించారు. ఈ–చలానా ద్వారా 79,228 కేసులు నమోదు చేసి రూ.51.32 లక్షలు వసూలు చేశామని, లోక్ అదాలత్ ద్వారా 3,337 కేసులు ఉపసంహరించామని చెప్పారు. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు వచ్చిన 16,829 అర్జీల్లో 16,806 పరిష్కరించామని వివరించారు. జిల్లాలో ప్రత్యేకంగా రాష్ట్రంలోనే మొట్టమొదటిగా ఈ–వెరిఫికేషన్ యాప్‌ను ఏర్పాటు చేసి రౌడీల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం వారధి కార్యక్రమాన్ని రూపొందించి జిల్లా పోలీసు కార్యాలయానికి రాకుండానే పరిష్కరించి సత్ఫలితాలు పొందామని వివరించారు. జిల్లాలో నూతన సంవత్సరంలో 'మేలుకొలుపు' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని, అందులో భాగంగా ఒక వాహనాన్ని ఏర్పాటు చేసి ప్రాంతాల వారీగా జరిగే నేరాలపై, ప్రత్యేకంగా వైట్ కాలర్ నేరాలు, ఆర్థిక నేరాలపై షార్ట్ ఫిల్మ్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు ఎస్పీ వివరించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)ఏబీటీఎస్ ఉదయరాణి, డీసీఆర్‌బీ డీఎస్పీ బి.మరియదాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి



సమావేశానికి హాజరైన రచయిత్రులు

ఒంగోలు కల్చరల్: మహిళలపై నానాటికీ పెరుగుతున్న దాడులు, అత్యాచారాలు, వేధింపులను అరికట్టేందుకు పాలకులు గట్టి చర్యలు చేపట్టాలని, మహిళలకు రక్షణ కల్పించాలని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు టి.అరుణ కోరారు. స్థానిక మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటైన సమావేశంలో ఆమె ప్రసంగించారు. స్త్రీల చైతన్యానికి రచయిత్రులు తమ రచనల ద్వారా మరింత కృషి చేయాలని పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులు, కార్యక్రమాల గురించి సమీక్షించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొలకలూరి స్వరూపరాణి, కె. కృపావరం, సింహాద్రి జ్యోతిర్మయి, ఎం.రాహేలు పాల్గొన్నారు.

సీఎంతో ప్రకటన చేయించాలి

ఒంగోలు: ఒంగోలులో విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించి సీఎం చంద్రబాబుతో ప్రకటన చేయించాలని ఏపీ విద్యార్థి జేఏసీ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, పాలపర్తి డేవిడ్‌రాజు, ఆమంచి కృష్ణమోహన్, ముత్తుమల అశోక్‌రెడ్డి, పోతుల రామారావులకు ఇప్పటికే లేఖలు రాసినట్లు ఏపీ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు రాయపాటి జగదీష్ తెలిపారు. నంద్యాల ఉప ఎన్నికలకు రూ.2 వేల కోట్లు ఖర్చు చేశారని, దాని ప్రకారం జిల్లాలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లాకు రానున్న సీఎం చంద్రబాబుతో విశ్వవిద్యాలయం ప్రకటన చేయించాలని ఎమ్మెల్యేలను కోరామన్నారు. లేకుంటే ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని ఆ లేఖల్లో ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు రాయపాటి జగదీష్ పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉపవాస దీక్షలు



విలేకరులతో మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ, పక్కన ఇతర నాయకులు

ఒంగోలు సెంట్రల్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి 5వ తేదీ వరకూ అన్ని పంచాయతీల వద్ద ఉపవాస దీక్షలు చేయాలని సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉసూరుపాటి బ్రహ్మయ్య మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు చంద్రబాబు పాదయాత్రను తెలంగాణలో టీఆర్ఎస్ అడ్డుకున్నట్లు చెప్పారు. ఆ సమయంలో మంద కృష్ణ మాదిగను పిలిపించుకుని పాదయాత్రను పూర్తి చేశారని గుర్తు చేశారు. అప్పట్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు మృతి చెందారని చెప్పారు. వారి శవాల సాక్షిగా చంద్రబాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మాదిగలకు అన్యాయం చేసిన చంద్రబాబు బాగుపడే అవకాశం లేదని శాపనార్థాలు పెట్టారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ కోసం అఖిల పక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షం కుడా ఎస్సీ వర్గీకరణపై చంద్రబాబుపై ఒత్తిడి తీసుకొచ్చి అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లేలా కృషి చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ కూడా హైదరాబాద్‌లో ఉపవాస దీక్షలు చేస్తున్నట్లు బ్రహ్మయ్య మాదిగ స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు టి.ఆనంద్‌మాదిగ, కె. సృజన్‌మాదిగ, జి.విల్సన్ మాదిగ, బి.తిరుమలరావు మాదిగ పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న ఆటో

- యువకుడి దుర్మరణం
- మంచే ప్రమాదానికి కారణం



గాయపడిన వెంకటరామయ్య



బతికి ఉన్నప్పుడు కృష్ణారెడ్డి

తాళ్లూరు: తాళ్లూరు–వెల్లంపల్లి రోడ్డులో పట్టు పరిశ్రమ కార్యాలయం సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. రుద్రవరం గ్రామానికి వాకా కృష్ణారెడ్డి (33) దొడ్ల డెయిరీ పాల ఏజెంట్. ఆటోలో తాళ్లూరు వైపు పాలు తీసుకెళ్తున్నాడు. అదే సమయంలో రైల్వేగార్డుగా పనిచేస్తున్న చల్లా వెంకటరామయ్య (25) మోటార్ బైక్‌పై కొత్తపాలెం నుంచి ఒంగోలు వైపు వెళ్తున్నాడు. ఆటో వస్తున్న వైపు కంకర కుప్ప ఉండటంతో అదుపుతప్పి ఆటో దాన్ని ఎక్కి కుడి వైపునకు వచ్చి బైకును ఢీకొట్టింది. మంచు సమయం కావడంతో దారి కూడా ఇద్దరికి సరిగా కనిపించలేదు. వెంకట రాయమ్య కాలు విరిగింది. చేతికి తీవ్ర గాయాలయ్యాయి. వాహనంలో ఒంగోలు వైద్యశాలకు తరలించారు. ఆటో డ్రైవర్ కృష్ణారెడ్డి ఛాతిలోకి ఆటో హ్యాండిల్ బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తాళ్లూరు ఆర్ఎంపీ వద్ద ప్రాథమిక చేయించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో కృష్ణారెడ్డి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ముగిసిన భాగవత జ్ఞాన యజ్ఞం



శీలానందను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ మాగుంట, దక్షిణామూర్తి

ఒంగోలు కల్చరల్: శ్రీ శారదా సంగీత సాహిత్య సభ ఆధ్వర్యంలో స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో ఈ నెల 24న ప్రారంభమైన స్వామిని శీలానంద భాగవత జ్ఞాన యజ్ఞ ప్రవచనాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. భగవంతుని అనుగ్రహాన్ని పొందేందుకు భక్తి, సత్కార్మాచరణ దోహదం చేస్తాయని ఆమె వివరించారు. శాసనమండలి సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అభినందనలు తెలిపారు. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి లక్ష్మీపద్మావతి విశిష్ట అతిథిగా హాజరై శీలానందను సన్మానించారు. ప్రముఖ పురోహితులు మఠంపల్లి దక్షిణామూర్తి, సంస్థ నిర్వాహకురాలు శారదాంబ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

లారీని ఢీకొన్న కారు

- ముగ్గురు మహిళలకు తీవ్రగాయాలు



ధ్వంసమైన కారు


మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి మహీ ఆగ్రో ఫ్యాక్టరీ ఎదుట ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. నలుగురు మహిళలు తిరుపతి నుంచి విజయవాడకు కారులో బయల్దేరారు. గుండ్లాపల్లి మహీ ఆగ్రో ఫ్యాక్టరీ సమీపంలో ముందు వెళ్తున్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొనటంతో ప్రమాదంలో జరిగింది. కారు మూడు పల్టీలు కొట్టడంతో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు స్పందించి వెంటనే కారులో ఉన్న క్షతగాత్రులను బయటకు లాగారు. ప్రమాదం విషయం తెలుసుకున్న ఎన్‌హెచ్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తరలించేందుకు ప్రయత్నించారు. ఇంటర్ సెప్టర్ వాహనంలో క్షతగాత్రులను ఎస్‌ఐ రంగనాథ్ కిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవిష్యం

మేషం: ఉత్సాహం, పట్టుదలతో ముందుకు సాగుతారు. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి. పనులు విజయవంతంగా పూర్తి. వ్యాపారవృద్ధి. ఉద్యోగులకు అనుకూలం.

వృషభం: సన్నిహితులతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. ఆలయాలు సందర్శిస్తారు. పనుల్లో స్వల్ప ఆటంకాలు. వ్యాపారాలు కొద్దిపాటి లాభాలు. ఉద్యోగులకు మార్పులు ఉండవచ్చు.

మిథునం: బంధువుల కలయిక. విందువినోదాలు. పనుల్లో పురోగతి. ఆధ్యాత్మిక చింతన. వాహనయోగం. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు ప్రోత్సాహం.



కర్కాటకం: శ్రమకు ఫలితం కాస్త కనిపిస్తుంది. పనుల్లో జాప్యం. ఆర్థిక పరిస్థితి మందగిస్తుంది. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి.

సింహం: దూరపు బంధువుల కలయిక. విందు వినోదాలు. యత్నకార్యసిద్ధి. మీ అంచనాలు నిజమవుతాయి. వ్యవహారాలలో విజయం. వ్యాపార, ఉద్యోగాలలో ముందడుగు వేస్తారు.

కన్య: అనుకున్న పనుల్లో విజయం. ఆప్తుల నుంచి ఆహ్వానాలు అందుతాయి. ఒక సమాచారం ఊరటనిస్తుంది. ఆలయ దర్శనాలు. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహవంతంగా ఉంటుంది.

తుల: రుణాలు చేస్తారు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. బంధువులతో తగాదాలు. పనులు నెమ్మదిగా సాగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిడులు.

వృశ్చికం: కుటుంబసమస్యలు. ఆర్థిక ఇబ్బందులు. పనులు నిదానంగా సాగుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి.

ధనుస్సు: కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. పలుకుబడి పెరుగుతుంది. బంధువులతో సఖ్యత. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహవంతంగా ఉంటాయి.

మకరం: శుభకార్యాలకు హాజరవుతారు. ఆర్థికాభివృద్ధి. కీలక నిర్ణయాలు. వ్యవహారాలలో విజయం. ఆప్తుల నుంచి ఆహ్వానాలు. వృత్తి, వ్యాపారాలు అనుకూలిస్తాయి.

కుంభం: రాబడి కన్నా ఖర్చులు అధికం. పనులు నిదానంగా సాగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. బంధువులతో వివాదాలు. వృత్తి, వ్యాపారాలు సాదాసీదాగా ఉంటాయి.

మీనం: మిత్రులతో మాటపట్టింపులు. ధనవ్యయం. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప మార్పులు.

– సింహంభట్ల సుబ్బారావు

ఒంగోలు నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసుల వివరాలు...

సర్వీస్ నంబర్	డిపో	బస్సు	నుంచి	వరకు	సమయం
తిరుపతికి...					
5121	గుంటూరు1	సూపర్‌లగ్జరి	గుంటూరు1	తిరుపతి	0.00
5127	పొన్నూరు	సూపర్‌లగ్జరి	పొన్నూరు	తిరుపతి	0.25
3876	విజయవాడ	గరుడ	విజయవాడ	తిరుపతి	1.00
2645	కాకినాడ	సూపర్‌లగ్జరి	కాకినాడ	తిరుపతి	1.05
3659	విజయవాడ	సూపర్‌లగ్జరి	విజయవాడ	తిరుపతి	1.15
3710	ఆటోనగర్	డీలక్స్	ఆటోనగర్	తిరుపతి	1.15
5407	తిరుపతి	సూపర్‌లగ్జరి	విజయవాడ	తిరుపతి	1.30
3999	ఆటోనగర్	సూపర్‌లగ్జరి	ఆటోనగర్	తిరుపతి	20.05
3481	మధువాడ	సూపర్‌లగ్జరి	విశాఖపట్నం	తిరుపతి	2.15
2621	కాకినాడ	సూపర్‌లగ్జరి	కాకినాడ	తిరుపతి	4.00
	కుప్పం	సూపర్‌లగ్జరి	విజయవాడ	కుప్పం	7.45
3676	విజయవాడ	సూపర్‌లగ్జరి	విజయవాడ	తిరుపతి	8.45
9232	మార్కాపురం	డీలక్స్	మార్కాపురం	తిరుపతి	9.15
3661	ఆటోనగర్	సూపర్‌లగ్జరి	ఆటోనగర్	తిరుపతి	10.10
3675	ఆటోనగర్	సూపర్‌లగ్జరి	ఆటోనగర్	తిరుపతి	10.50
3663	గవర్నర్‌పేట 2	ఎక్స్‌ప్రెస్	విజయవాడ	తిరుపతి	10.55
3868	విద్యాధరపురం	సూపర్‌లగ్జరి	విజయవాడ	తిరుపతి	12.00
3708	మచిలీపట్నం	సూపర్‌లగ్జరి	మచిలీపట్నం	తిరుపతి	12.45
3725	ఆటోనగర్	సూపర్‌లగ్జరి	ఆటోనగర్	తిరుపతి	12.50
3924	విద్యాధరపురం	సూపర్‌లగ్జరి	విజయవాడ	తిరుపతి	13.15
3898	విద్యాధరపురం	సూపర్‌లగ్జరి	విజయవాడ	తిరుపతి	14.45
3980	అవనిగడ్డ	సూపర్‌లగ్జరి	అవనిగడ్డ	తిరుపతి	15.45
5363	కుప్పం	సూపర్‌లగ్జరి	విజయవాడ	కుప్పం	18.00
3867	గవర్నర్‌పేట 2	ఎక్స్‌ప్రెస్	విజయవాడ	తిరుపతి	18.00
3706	ఆటోనగర్	డీలక్స్	ఆటోనగర్	తిరుపతి	20.10
4607	వినుకొండ	సూపర్‌లగ్జరి	వినుకొండ	తిరుపతి	20.30
3669	ఆటోనగర్	సూపర్‌లగ్జరి	ఆటోనగర్	తిరుపతి	21.05
3587	మచిలీపట్నం	సూపర్‌లగ్జరి	మచిలీపట్నం	తిరుపతి	21.30
4124	గుంటూరు 1	సూపర్‌లగ్జరి	గుంటూరు 1	తిరుపతి	22.00
9234	మార్కాపురం	డీలక్స్	మార్కాపురం	తిరుపతి	22.00
3671	ఆటోనగర్	సూపర్‌లగ్జరి	ఆటోనగర్	తిరుపతి	23.05
3955	గుడివాడ	సూపర్‌లగ్జరి	గుడివాడ	తిరుపతి	23.10
3655	విద్యాధరపురం	సూపర్‌లగ్జరి	విజయవాడ	తిరుపతి	23.20
శ్రీశైలంకు...					
45000	అద్దంకి	ఎక్స్‌ప్రెస్	అద్దంకి	శ్రీశైలం	6.15
5853	చీరాల	ఎక్స్‌ప్రెస్	చీరాల	శ్రీశైలం	7.15
5852	చీరాల	ఎక్స్‌ప్రెస్	చీరాల	శ్రీశైలం	7.45
5931	అద్దంకి	ఎక్స్‌ప్రెస్	అద్దంకి	శ్రీశైలం	8.30
48001	అద్దంకి	ఎక్స్‌ప్రెస్	అద్దంకి	శ్రీశైలం	9.00
9225	అద్దంకి	ఎక్స్‌ప్రెస్	అద్దంకి	శ్రీశైలం	13.45
46676	వెంకటగిరి	డీలక్స్	వెంకటగిరి	శ్రీశైలం	15.15
5142	వెంకటగిరి	ఎక్స్‌ప్రెస్	వెంకటగిరి	శ్రీశైలం	01.15
5124	వెంకటగిరి	సూపర్‌లగ్జరి	వెంకటగిరి	శ్రీశైలం	01.30
5152	వెంకటగిరి	సూపర్‌లగ్జరి	వెంకటగిరి	శ్రీశైలం	02.15
	వెంకటగిరి	ఎక్స్‌ప్రెస్	వెంకటగిరి	శ్రీశైలం	18.25
పులివెందులకు...					
6141	పులివెందుల	సూపర్‌లగ్జరి	విజయవాడ	కదిరి	22.30
6146	పులివెందుల	డీలక్స్	ఒంగోలు	పులివెందుల	21.30
పుట్టపర్తి, అనంతపురంకు...					
6927	పుటపర్తి	సూపర్‌లగ్జరి	ఒంగోలు	పుటపర్తి	15.00
6684	అనంతపురం	సూపర్‌లగ్జరి	ఒంగోలు	అనంతపురం	16.00
6901	పుటపర్తి	ఎక్స్‌ప్రెస్	ఒంగోలు	పుటపర్తి	16.30
6688	అనంతపురం	సూపర్‌లగ్జరి	ఒంగోలు	అనంతపురం	18.00
	జమ్మలమడుగు	సూపర్‌లగ్జరి	ఒంగోలు	జమ్మలమడుగు	09.30

కళా సంస్థలు

ఎన్‌టీఆర్ కళాపరిషత్	–	98489 10111
శ్రీ కళా ప్రకాశం	–	94412 92291
ఎన్‌టీఆర్ కల్చరల్ అసోసియేషన్	–	90004 25811
ఆంధ్రనాటక కళాసమితి	–	93475 05277
అభినయ	–	94402 42244
స్పందన థియేటర్స్	–	98498 98800
అభ్యుదయ కళాసమితి	–	81432 67539
జనచైతన్య	–	96034 49600
నాట్యావధాన కళాపీఠం	–	99089 56555
కాత్యాయనీ నాట్య మండలి	–	99121 17372
యవనిక	–	95022 52901
పండు క్రియేషన్స్	–	95737 36675
సావిత్రి నాటక కళాపరిషత్	–	98662 03795
చైతన్య కళాభారతి	–	93904 22024

నృత్య శిక్షణ సంస్థలు

శ్రీ నళినీప్రియ కూచిపూడి నృత్యనికేతన్	–	99892 44417
త్యాగరాజ దత్తసాయి లలిత కళా క్షేత్రం	–	86886 65025
విజయ్ డాన్స్ అకాడమీ	–	98483 92979

ఈ వారం కార్యక్రమాలు

- 1వ తేదీ సోమవారం ఆలయాలు, కార్యాలయాలు, ప్రార్థనా మందిరాల్లో నూతన సంవత్సర వేడుకలు
- శ్రీగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు సువర్ణ అష్టదళ పద్మపాదారాధన
- జేఎంబీ చర్చిలో ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక ఆరాధన
- జువెట్ ప్రార్థనల కొండపై ఉదయం 5 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు

–ఒంగోలు కల్చరల్

ధ్యాన లేదా యోగా కేంద్రాలు

1. యూనియన్‌బ్యాంక్ పక్కన, గాంధీరోడ్డు, ఒంగోలు(భారత్ స్వాభిమాన్ పతంజలి యోగా పీఠం ట్రస్టు)
2. హఠయోగా శిక్షణా కేంద్రం, నెల్లూరు బస్టాండు, ఒంగోలు
3. భీమయ్య గురూజీ యోగసెంటర్, ఒంగోలు, (ఆదివారం మినహా అన్ని రోజులు), ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30గంటలకు, కాంటాక్ట్ నెంబర్– 9394777647
4. యోగా మిత్ర మండలి, బైపాస్‌రోడ్డు, ఒంగోలు. ప్రతిరోజు ఉదయం 6గంటలనుంచి 9గంటలవరకు– కాంటాక్ట్ నెంబర్ 9951136984.
5. శ్రీసత్యసాయియోగా ట్రెనింగ్ సెంటర్, ఒంగోలు
6. క్రియాయోగా శిక్షణా కేంద్రం.కాంటాక్ట్ నెంబర్– రాంబాబు– 09849107872

బుల్లితెర

W

SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 గుడ్ మార్నింగ్
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.30 న్యూస్ ఫీచర్
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 బతుకు చిత్రం
ఉ.10.30 జనపథం
ఉ.11.30 న్యూస్ ఫీచర్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.00 రీజనల్ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజైన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే

టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.07.00 అమ్మోరు తల్లి
ఉ.09.30 ఉలవచారు బిర్యాని
మ.12.00 గ్యాంగ్ లీడర్
మ.03.00 చెప్పవే చిరుగాలి
రా.09.00 తుఫాన్



మూవీస్ నౌ
ఉ.09.45 మినియన్స్
ఉ.11.30 జురాసిక్ పార్క్
మ.01.30 ద జంగిల్ బుక్
మ.03.20 స్పెక్టర్
రా.09.00 ద రెవెనెంట్



హెచ్‌బీవో
ఉ.06.00 ట్రేసర్స్
ఉ.07.27 స్టోర్క్స్
ఉ.10.53 సూసైడ్ స్క్వాడ్
సా.06.59 మీట్ ద ఫాకర్స్
రా.09.00 మ్యాన్ ఆఫ్ స్టీల్



స్టార్ మూవీస్
ఉ.06.32 జూమ్
ఉ.08.13 ద క్రూడ్స్
ఉ.11.36 డాక్టర్ స్ట్రేంజ్
మ.01.46 ఫైండింగ్ డోరీ
రా.09.00 ఫ్రోజెన్



మా మూవీస్
ఉ.07.00 ఆనంద్
ఉ.09.00 డాన్
మ.12.00 ఖుషి
సా.06.00 భలే భలే మగాడివోయ్
రా.09.00 మాస్



జీ సినిమా
ఉ.07.30 కొరియర్ బాయ్ కళ్యాణ్
మ.12.02 ఫిర్ హెరా ఫేరీ
మ.03.20 వివాహ్
రా.09.00 బాఘీ
రా.11.49 ఆర్య: ఏక్ దీవానా

ప్రకాశం వాతావరణం

గరిష్టం : 33.7° కనిష్టం : 20.9°

నేడు : స్వల్పంగా గాలులు వీయవచ్చు. ఆహ్లాదకరమైన ఉదయం. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్టం 32 డిగ్రీలు, కనిష్టం 21 డిగ్రీలు.

రేపు : గాలులు వీయవచ్చు. ఆహ్లాదకరమైన ఉదయం. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టం 32 డిగ్రీలు, కనిష్టం 21 డిగ్రీలు.

బుధవారం : స్వల్పంగా గాలులు వీయవచ్చు. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్టం 31 డిగ్రీలు, కనిష్టం 22 డిగ్రీలు.

తిరుమల సమాచారం



తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ చాలా తగ్గింది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు మాత్రమే నిండాయి.
సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు	–	ఖాళీ లేవు
రూ.50 గదులు	–	ఖాళీ లేవు
రూ.100 గదులు	–	ఖాళీ లేవు
రూ.500 గదులు	–	ఖాళీ లేవు

రద్దీ కారణంగా జనవరి రెండో తేదీ వరకు ప్రత్యేక సేవలు రద్దు చేశారు.

గోరంతలను కొండంతలుగా చెప్పడమే 'అతిశయోక్తి'



గంగనపల్లె వెంకటరమణ
స్కూల్ అసిస్టెంట్ (తెలుగు),
జెడ్పీహెచ్ఎస్, పి.వి.జి. పల్లె,
పుల్లంపేట, వైఎస్ఆర్ కడప జిల్లా

అమరావతి

సామర్థ్యం: 3. భాషాంశాలు (పదజాలం)

◆ **కింది పదాలకు అర్థాలు రాసి, వాటిని సొంత వాక్యాల్లో ప్రయోగించండి.**

1. దగ్గర = చేరువలో, సమీపంలో
రాజంపేట పట్టణానికి దగ్గరలో అన్నమాచార్యుల జన్మస్థలం తాళ్లపాక గ్రామం ఉంది.
2. జగజ్జేగీయమానం = ప్రపంచంచే కీర్తింపబడటం
చరిత్రలో అలెగ్జాండర్ జగజ్జేగీయమానంగా వెలుగొందాడు.
3. వైభవోపేతం = వైభవంతో కూడి ఉండటం
జనక మహారాజు తన కుమార్తె సీత వివాహాన్ని వైభవోపేతంగా జరిపించాడు.
4. పునీతం = పవిత్రం
తథాగతుని పాదస్పర్శతో అమరారామం పునీతమైందని బౌద్ధుల విశ్వాసం.
5. ముగ్ధులు = ఆనంద పరవశులు
హరిక అద్భుత నృత్య ప్రదర్శనను చూసిన ప్రేక్షకులు ముగ్ధులయ్యారు.

◆ **కింది పదాలకు పర్యాయ పదాలు రాసి, వాటితో సొంత వాక్యాలు రాయండి.**

1. కీర్తి = యశస్సు, ఖ్యాతి
మన ఆంధ్రప్రదేశ్ కీర్తి పతాకం వినువీధుల్లో రెపరెపలాడాలి.
ఎంతోమంది ఖ్యాతి గడించినవారు ఆంధ్రప్రదేశ్ యశస్సును పెంచారు.
2. కానుక = చందా, కానిక
నేను వినాయక చవితి ఉత్సవాలకు చందా ఇచ్చాను. అలా కానిక ఇవ్వడం నాకెంతో సంతోషాన్నిచ్చింది.
3. గ్రంథం = పుస్తకం, పొత్తం
పుస్తకాలను పువ్వుల్లాగ చూసుకోవాలి. పొత్తములను మురికి చేయరాదు.
4. రాజు = ప్రభువు, నరపతి
విజయనగర ప్రభువు శ్రీకృష్ణదేవరాయలు. ఆ నరపతి కొలువులో అష్టదిగ్గజ కవులు ఉండేవారు.
5. పురం = నగరం, పట్టణం
మేము కడప నగరంలో నివసిస్తున్నాం. మా పట్టణమంటే మాకెంతో ఇష్టం.
6. సందేహం = అనుమానం, సందిగ్ధం
విద్యార్థులకు చదివేటప్పుడు అనుమానాలు వస్తాయి. ఆ సందిగ్ధాలను ఉపాధ్యాయుల ద్వారా నివృత్తి చేసుకోవాలి.

వ్యాకరణాంశాలు

◆ **కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి.**

1. భయపడు = భయము + పడు –పడ్వాదుల సంధి
2. సందేహపడు = సందేహము + పడు –పడ్వాదుల సంధి
3. ఆనందపడు = ఆనందము + పడు –పడ్వాదుల సంధి
4. సన్నుతి = సత్ + నుతి –అనునాసిక సంధి
5. భంగపడు = భంగము + పడు –పడ్వాదుల సంధి

◆ **కింది ప్రత్యక్ష వాక్యాలను పరోక్ష కథనంలోకి మార్చి రాయండి.**

1. 'నేను నేటి సినిమాలను చూడలేకపోతున్నాను' అని అమ్మమ్మతో అన్నాను.
జ. తాను నేటి సినిమాలను చూడలేకపోతున్నానని అమ్మతో అన్నాడు.
2. 'నీకివ్వాల్సింది ఏమీలేదు' అని నాతో అతడన్నాడు.
జ. నాకివ్వాల్సింది ఏమీ లేదని నాతో అతడన్నాడు.

◆ **కింది వాక్యాలను ప్రత్యక్ష కథనంలోకి మార్చి రాయండి.**

1. సుందరకాండ చదవాలని తనకు ఉపాధ్యాయుడు చెప్పాడు.
జ. 'సుందరకాండ చదువు' అని నాకు ఉపాధ్యాయుడు చెప్పాడు.
2. వాళ్ళమ్మ చెప్పింది భానుప్రకాశ్ ఊరికెళ్లాడని.
జ. 'భానుప్రకాశ్ ఊరికెళ్లాడు' అని వాళ్ళమ్మ చెప్పింది.
3. ప్రజ్ఞ పద్యాలు బాగా పాడిందని అందరూ అనుకుంటున్నారు.
జ. 'ప్రజ్ఞ పద్యాలు బాగా పాడింది' అని అందరను కుంటున్నారు.

◆ **కింది వాక్యాలలోని అలంకారాలను గుర్తించండి. లక్షణాలను రాయండి.**

1. వాడు తాటిచెట్టంత పొడవు ఉన్నాడు.
2. దేవాలయ గోపురాలు ఆకాశానికంటుతున్నాయి.
3. రంగయ్య పొలంలో బంగారం పండింది.

జ: పై మూడు వాక్యాల్లో అతిశయోక్తి అలంకారం ఉంది.
లక్షణం: విషయాన్ని ఉన్నదాని కంటే ఎక్కువచేసి చెప్పడాన్ని అతిశయోక్తి అంటారు లేదా గోరంతలను కొండంతలుగా చేసి చెప్పడాన్ని అతిశయోక్తి అలంకారం అంటారు.

◆ **కింది పద్యంలోని అలంకారాన్ని గుర్తించండి. లక్షణ సమన్వయం చేయండి.**

కందం: చుక్కలు తలపూవులుగా
అక్కజముగ మేను పెంచి యంబర వీధిన్
వెక్కసమై చూపట్టిన
యక్కోమలి ముదము నొందె నాత్మస్థితిలోన్

జ. పద్యంలో అతిశయోక్తి అలంకారం ఉంది.
లక్షణం: గోరంతలను కొండంతలుగా చేసి చెప్పడాన్ని అతిశయోక్తి అలంకారం అంటారు.
సమన్వయం: హనుమంతుడు తన శరీరాన్ని పెంచాడు. అప్పుడు ఆకాశంలోని నక్షత్రాలు హనుమంతుని తలలో పూవులుగా కనబడ్డాయని చెప్పడం జరిగింది. ఎంత ఎత్తుకెదిగినా ఆకాశంలోని నక్షత్రాలు తల పూవులుగా ఉండడం అనేది జరగదు. కాబట్టి ఇది అతిశయోక్తి అలంకారం అవుతుంది.

మాతృభావన

ప్రకృతి పదాలు – వికృతి పదాలు

1. రాజ్ఞి – రాణి	2. ఆజ్ఞ – ఆన
3. ఛాయ – చాయ	4. రత్నము – రతనము
5. భక్తి – బత్తి	6. గౌరవము – గారవము
7. బ్రహ్మ – బమ్మ / బొమ్మ	8. పుణ్యము – పున్నెము
9. జ్యోతి – జోతి	10. రాశి – రాసి
11. గృహము – గీము	12. దోషము – దోసము
13. అంబ– అమ్మ	14. భాగ్యము – బాగెము

వ్యుత్పత్త్యర్థాలు

వ్యుత్పత్తి పదం	వ్యుత్పత్తి	అర్థం
1. శివుడు	సాధువుల హృదయంలో శయనించి ఉండేవాడు, మంగళప్రదుడు	ఈశ్వరుడు
2. పతివ్రత	పతిని సేవించడమే వ్రతంగా కలిగినది	సాధ్వి
3. పురంధ్రి	గృహమును ధరించునది	ఇల్లాలు
4. అంగన	శ్రేష్ఠమైన అవయవాలు కలది	స్త్రీ

నానార్థాలు

1. వాసము = ఇల్లు, వస్త్రం
2. సూత్రము = దారం, వ్యాకరణ సూత్రం, నియమం
3. చరణము = పాదం, పద్యపాదం, వేదభాగం, కిరణం
4. హరి = కోతి, ఇంద్రుడు, విష్ణువు
5. రత్నము = మణి, శ్రేష్ఠము, సూదంటు రాయి

◆ **కింది పద్య పాదాల్లోని అలంకారాన్ని గుర్తించండి. దాని లక్షణం రాయండి.**



'అనుచున్ జేవురు మీఱు కన్నుఁగవతో, నాస్పందతోష్ఠంబుతో ఘన హుంకారముతో నటద్భ్రుకుటితో గర్జిల్లు నా భోన్సలేశున్ జూడన్ ...'
అలంకారం: స్వభావోక్తి
లక్షణం: జాతి, గుణ, క్రియాదులను ఉన్నవి ఉన్నట్లుగా వర్ణిస్తే దాన్ని స్వభావోక్తి అలంకారం అంటారు.

◆ **కింది పద్య పదాలకు గురు, లఘువులను గుర్తించి, గణ విభజన చేసి, అవి ఏ పద్యాలకు సంబంధించినవో రాయండి.**

1.

మ	స	జ	స	త	త	గ
U U U	I I U	I U I	I I U	U U I	U U I	U

ఆయేమీ యొకరా ణివాస మునుబు ణ్యావాస మున్దెచ్చి నా
పద్యం: శార్దూలాం
గణాలు: మ, స, జ, స, త, త, గ
యతి మైత్రి: 1-13 అక్షరాలు

2.

స	భ	ర	న	మ	య	వ
I I U	U I I	U I U	I I I	U U U	I U U	I U

అనల జ్యోతుల నీపతి వ్రతలఁ బాపాచా రులైడా యుభూ
పద్యం: మత్తేభం
గణాలు: స, భ, ర, న, మ, య, వ
యతి మైత్రి: 1-14 అక్షరాలు

◆ **కింది పదాలను విడదీసి, సంధి పేర్లు రాయండి.**

1. పుణ్యావాసము = పుణ్య + ఆవాసము – సవర్ణదీర్ఘ సంధి
2. మదోన్మాదము = మద + ఉన్మాదము – గుణ సంధి
3. స్నిగ్ధాంబుధ = స్నిగ్ధ + అంబుధ – సవర్ణదీర్ఘ సంధి
4. సరభసోత్సాహం = సరభస + ఉత్సాహం – గుణసంధి
5. గుణౌద్ధత్యం = గుణ + ఔద్ధత్యం – వృద్ధి సంధి
6. రసైక స్థితి = రస + ఏకస్థితి – వృద్ధి సంధి
7. బంధమూడ్చి = బంధము + ఊడ్చి – ఉత్వ సంధి
8. అవ్వారల = ఆ + వారల – త్రిక సంధి
9. భక్తురాలు = భక్త + ఆలు – రుగాగమ సంధి
10. బాలెంతరాలు = బాలెంత + ఆలు – రుగాగమ సంధి
11. గుణవంతురాలు = గుణవంత + ఆలు – రుగాగమ సంధి
12. దేశాల = దేశము + ల – ఉలులల సంధి
13. పుస్తకాలు = పుస్తకము + లు – ఉలులల సంధి
14. సమయాన = సమయము + న – ఉలులల సంధి
15. వాఙ్మయం = వాక్ + మయం – అనునాసిక సంధి
16. రాణ్మహేంద్రవరం = రాట్ + మహేంద్రవరం –అనునాసిక సంధి
17. జగన్నాథుడు = జగత్ + నాథుడు – అనునాసిక సంధి
18. తన్మయము = తత్+ మయము – అనునాసిక సంధి
19. రాణ్మణి = రాట్ + మణి – అనునాసిక సంధి
20. మరున్నందనుడు = మరుత్ + నందనుడు – అనునాసిక సంధి

జానపదుని జాబు

◆ **కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి.**

1. ఆహాహా = ఆహా + ఆహా – ఆమ్రేడిత సంధి
2. ఏమేమి = ఏమి + ఏమి – ఆమ్రేడిత సంధి
3. అక్కడక్కడ = అక్కడ + అక్కడ – ఆమ్రేడిత సంధి
4. పట్టపగలు = పగలు + పగలు – ఆమ్రేడిత సంధి
5. పూరెమ్మ = పూవు + రెమ్మ – ప్రాతాది సంధి
6. పూదోట = పూవు + తోట – ప్రాతాది సంధి
పూ + తోట – సరళాదేశ సంధి
7. మీఁగడ = మీఁదు + కడ – ప్రాతాది సంధి
మీ + కడ – సరళాదేశ సంధి
8. కెందామరలు = కెంపు + తామరలు – ప్రాతాది సంధి
కెం + తామరలు – సరళాదేశ సంధి
9. ప్రాయిల్లు = ప్రాత + ఇల్లు – ప్రాతాది సంధి
ప్రా + ఇల్లు – యడాగమ సంధి

◆ **కింది సామాన్య వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా మార్చి రాయండి.**

1. మహేశ్ పాఠం చదివాడు. మహేశ్ పాఠం అర్థం చేసుకున్నాడు.
జ. మహేశ్ పాఠం చదివి, అర్థం చేసుకున్నాడు.
2. వైద్యుడు ప్రథమ చికిత్స చేస్తాడు. వైద్యుడు మందులు ఇస్తాడు.
జ. వైద్యుడు ప్రథమ చికిత్స చేశాక మందులు ఇస్తాడు.
3. మనస్విని టీవీ చూస్తుంది. మనస్విని నృత్యం చేస్తుంది.
జ. మనస్విని టీవీ చూస్తూ నృత్యం చేస్తుంది.

◆. **కింది సామాన్య వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చి రాయండి.**

1. రామకృష్ణారెడ్డి గురువు. వెంకటరమణ శిష్యుడు.
జ. రామ కృష్ణారెడ్డి వెంకటరమణలు గురుశిష్యులు.
2. చందన సంగీతం నేర్చుకుంటుంది. చందన నృత్యం నేర్చుకుంటుంది.
జ. చందన సంగీతం, నృత్యం నేర్చుకుంటుంది.
3. హరికకు పాడటమంటే ఆసక్తి. హరికకు వినడమంటే విరక్తి.
జ. హరికకు పాడటమంటే ఆసక్తి, కానీ వినడమంటే విరక్తి.
4. రాజు బడికి వచ్చాడు. నాయుడు బడికి వచ్చాడు. ప్రసాద్ బడికి వచ్చాడు.
జ. రాజు, నాయుడు, ప్రసాద్‌లు బడికి వచ్చారు.
5. ఆయన కవి. ఆయన గాయకుడు. ఆయన విద్యావేత్త.
జ. ఆయన కవి, గాయకుడు, విద్యావేత్త.

సార్క్ దేశాల విపత్తు నిర్వహణ కేంద్రం ఎక్కడ ఉంది?



బొమ్మనబోయిన శ్రీనివాస్
సీనియర్ ఫ్యాకల్టీ

డీఎస్సీ సోషల్ స్టడీస్ ప్రత్యేకం

ప్రకృతి వైపరీత్యాలు

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో తరచుగా తుఫానులకు గురయ్యే ప్రాంతాలు ఏవి?
   ఎ) తూర్పు, ఈశాన్య ప్రాంతాలు
   బి) తూర్పు, ఆగ్నేయ ప్రాంతాలు
   సి) పశ్చిమ, నైరుతి ప్రాంతాలు
   డి) పశ్చిమ, వాయవ్య ప్రాంతాలు
2. వరదలు ఎక్కువగా సంభవించే మైదాన ప్రాంతాలు ఏవి?
   ఎ) గంగా సింధూ మైదానం
   బి) దక్కన్ పీఠభూమి మైదాన ప్రాంతం
   సి) కృష్ణా- గోదావరి డెల్టా మైదానం
   డి) గంగా-బ్రహ్మపుత్ర మైదానం
3. దక్షిణ భారతదేశంలో తీవ్ర కరువుకు గురయ్యే ప్రాంతం ఏది?
   ఎ) రాయలసీమ (ఆంధ్రప్రదేశ్)
   బి) కొంగునాడు (తమిళనాడు)
   సి) దక్షిణ తెలంగాణ
   డి) వయనాడు (కేరళ)
4. కింది వాటిలో వేగంగా వచ్చే విపత్తులు కానివి ఏవి?
   ఎ) అగ్నిపర్వతాలు పగిలిపోవడం
   బి) కొండ చరియలు విరిగిపడటం
   సి) వరదలు రావడం
   డి) కరువుకాటకాలు సంభవించడం
5. కింది వాటిలో విపత్తుల నిర్వహణ చర్యలకు కు సంబంధించనిది ఏది?
   ఎ) విపత్తులు రాకుండా ఆపడం
   బి) విపత్తుల ప్రభావాన్ని తగ్గించడం
   సి) విపత్తులను ఎదుర్కొనే సంసిద్ధతను ఏర్పరచడం
   డి) పైవేవీ కావు
6. 'సునామీ' అనే పదంలో 'సు' అంటే జపాన్ భాషలో అర్థమేమిటి?
   ఎ) అల బి) ప్రమాదం
   సి) సముద్రం డి) రేవు
7. సునామీకి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) సునామీ అలలు తీరాన్ని చేరుతున్నప్పుడు వాటి వేగం, తరంగ దైర్ఘ్యం తగ్గుతుంది
   బి) సముద్రంలో భూపలకల కదలికల వల్ల, అగ్నిపర్వతాల విస్ఫోటనం వల్ల, కొండచరియలు విరిగిపడటం వల్ల సునామీ వస్తుంది
   సి) రోజులో ఏ సమయంలోనైనా సునామీ సంభవించవచ్చు
   డి) పైవన్నీ సరైనవే
8. తక్కువ వర్షపాతం కురవడం అంటే?
   ఎ) సగటు వర్షపాతం కంటే తక్కువగా వర్షం పడటం
   బి) సగటు వర్షపాతం కంటే 20-59 శాతం తక్కువగా వర్షం పడటం
   సి) సగటు వర్షపాతం కంటే 19 శాతం ఎక్కువ నుంచి 19 శాతం తక్కువ వరకు వర్షపాతం ఉండడం
   డి) సగటు వర్షపాతంలో 60 శాతం కంటే తక్కువగా వర్షం పడటం
9. కరువు ప్రభావం వల్ల ఏర్పడే తీవ్ర పరిణామాల్లో కింది వాటిలో లేనిది ఏది?
   ఎ) భూగర్భ నీటిమట్టం పడిపోతుంది
   బి) ప్రజల వలసలు పెరుగుతాయి
   సి) వ్యవసాయ అనుబంధ రంగాల్లోని ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుంది
   డి) పైవేవీ కావు
10. IWMPను విస్తరించండి.
    ఎ) Integrated Watershed Management Programme
    బి) Internal Water Management Programme
    సి) Integrated Water Maintenance Project
    డి) Internal Watershed Management Project
11. 'టెర్రరిజం' (ఉగ్రవాదం) అనే ఆంగ్ల పదం 'Terrorisme' అనే ఏ భాషాపదం నుంచి ఉద్భవించింది?
    ఎ) గ్రీక్ బి) ఫ్రెంచ్
    సి) లాటిన్ డి) ఇటాలియన్
12. భూకంపం సంభవించే ప్రాంతాన్ని ఏమని పిలుస్తారు?
    ఎ) భూకంప నాభి
    బి) భూకంప అధికేంద్రం
    సి) భూకంప ద్రోణి
    డి) భూకంప పరివాహం
13. భూకంపాలను నమోదు చేసే కేంద్రాలకు మొదటగా చేరే తరంగాలు ఏవి?
    ఎ) P తరంగాలు బి) S తరంగాలు
    సి) M తరంగాలు డి) L తరంగాలు
14. కింది వాటిలో 'ర్యాలీ తరంగాలు' ఏవి?
    ఎ) P తరంగాలు బి) S తరంగాలు
    సి) T తరంగాలు డి) L తరంగాలు
15. భూ ఉపరితలంపై నష్టానికి కారణమవుతున్న భూకంప తరంగాలు ఏవి?
    ఎ) ప్రాథమిక తరంగాలు
    బి) గౌణ తరంగాలు సి) దీర్ఘ తరంగాలు
    డి) చర్యశీలా తరంగాలు
16. లోతునాభి (Deep Focus) భూకంపాలు అంటే?
    ఎ) భూకంప నాభి లోతు 300కి.మీ. కంటే అధికంగా ఉండి ఏర్పడే భూకంపాలు
    బి) భూకంప నాభి లోతు 500కి.మీ. కంటే అధికంగా ఉండి ఏర్పడే భూకంపాలు
    సి) భూకంప నాభి లోతు 300కి.మీ.- 500కి.మీ. మధ్య ఉండి ఏర్పడే భూకంపాలు
    డి) భూకంప అభికేంద్రానికి అతి లోతుగా ఏర్పడే భూకంపాలు
17. కింది వాటిలో భూకంపాలు సంభవించడానికి కారణం కానిది ఏది?
    ఎ) హిమ సంపాతాలు
    బి) భూపాతాలు
    సి) అత్యధిక స్థాయిలో అంతర్భూజల నిక్షేపాలను వినియోగించడం
    డి) పైవేవీ కావు
18. అత్యధికంగా భూకంపాలు సంభవించే ప్రాంతాల్లో కింది వాటిలో లేనిది ఏది?
    ఎ) అలూషియన్ ద్వీపాలు
    బి) కాకసస్ పర్వతాలు
    సి) కురైల్ ద్వీపాలు డి) అకైషీ పర్వతాలు
19. కింది వాటిలో అత్యంత తీవ్ర భూకంపం ఏది?
    ఎ) కోయనా భూకంపం (మహారాష్ట్ర- 1967)
    బి) ఉత్తర కాశీ భూకంపం (ఉత్తరప్రదేశ్- 1991)
    సి) లాతూరు భూకంపం (మహారాష్ట్ర- 1993)
    డి) భుజ్ భూకంపం(గుజరాత్- 2001)
20. 'ఫూజిటా స్కేలు' ఏ ప్రకృతి విధ్వంసాన్ని వర్గీకరిస్తుంది?
    ఎ) భూకంపాలు బి) టొర్నెడొలు
    సి) సునామీలు డి) భూపాతాలు
21. జాతీయ విపత్తుల నిర్వహణ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
    ఎ) డిసెంబర్ 28 బి) అక్టోబర్ 29
    సి) మే 10 డి) జూన్ 27
22. సాధారణంగా సునామీ సగటు వేగం ఎంత ఉంటుంది?
    ఎ) 800 కి.మీ./గం.
    బి) 500 కి.మీ./గం.
    సి) 1000 కి.మీ./గం.
    డి) 200 కి.మీ./గం.
23. ఇంటర్నేషనల్ సునామీ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఎక్కడ ఉంది?
    ఎ) ఇవా (హవాయి)
    బి) హోనోలులు (హవాయి)
    సి) పాల్మర్ (అలస్కా) డి) గోవా
24. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారిక సంస్థను ఏ సంవత్సరంలో నెలకొల్పారు?
    ఎ) 2005 బి) 2006
    సి) 2008 డి) 2009
25. జాతీయ విపత్తు స్పందన దళం (National Disaster Response Force) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    ఎ) హైదరాబాద్ బి) చెన్నై
    సి) న్యూఢిల్లీ డి) ముంబై
26. కింది వాటిలో విపత్తు నిర్వహణ చర్యల్లో భాగం కాని కార్యక్రమం ఏది?
    ఎ) సహాయక చర్యలు చేపట్టడం
    బి) నియంత్రణ
    సి) పునరావాసం కల్పించడం
    డి) ఉపశమన చర్యలు
27. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఎవరు వ్యవహరిస్తారు?
    ఎ) కేంద్ర హోం మంత్రి
    బి) కేంద్ర రక్షణ మంత్రి
    సి) కేంద్ర పర్యావరణ విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి
    డి) ప్రధానమంత్రి
28. 'డిజాస్టర్' (విపత్తు) అనే ఆంగ్ల పదం 'Dusaster' అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. దాని అర్థం ఏమిటి?
    ఎ) ప్రమాదకరమైన పక్షి
    బి) దుష్ట రాక్షసి సి) చెడు నక్షత్రం
    డి) శాంతి దేవత
29. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 7.0గా నమోదైతే, అది ఎన్ని అణుబాంబుల శక్తితో సమానంగా అంచనా వేస్తారు?
    ఎ) 100 బి) 1000
    సి) 10 డి) 10,000
30. ఇప్పటివరకు అత్యధిక ప్రాణ నష్టం కలిగించిన తుఫాన్ ఏది?
    ఎ) కత్రినా బి) టిప్
    సి) భోలా డి) ఐలా
31. భూకంప సముద్ర తరంగం అంటే?
    ఎ) భూకంపం బి) సునామీ
    సి) టొర్నెడొ డి) భూపాతం
32. 'టొర్నెడొ' అనే ఆంగ్ల పదం 'Tronada' అనే స్పానిష్ భాషాపదం నుంచి వచ్చింది. దాని అర్థం ఏమిటి?
    ఎ) గాలి తుఫాను బి) మెరుపుల వర్షం
    సి) భయంకరమైన ఉరుము
    డి) ఉరుముల తుఫాను
33. అతి తీవ్రమైన టొర్నెడొల వాయువేగం గంటకు ఎన్ని కిలోమీటర్లు?
    ఎ) 100 పైన బి) 200 పైన
    సి) 300 పైన డి) 500 పైన
34. కాన్సాస్ (USA) నగరంలోని ఒక పిండి బస్తా ఏ ప్రకృతి విపత్తు వల్ల 177 కి.మీ. దూరంలోని ప్రదేశంలో లభించింది?
    ఎ) సునామీ బి) భూపాతం
    సి) వరదలు డి) టొర్నెడొ
35. ప్రపంచంలోనే అత్యంత తీవ్రమైన టొర్నెడొలు ఏ దేశంలో సంభవిస్తున్నాయి?
    ఎ) యు.ఎస్.ఎ. బి) కెనడా
    సి) బంగ్లాదేశ్ డి) న్యూజిలాండ్
36. భూపాతాలకు దారితీసే ప్రధాన కారణాల్లో కింది వాటిలో లేనిది ఏది?
    ఎ) భూసహజ ప్రకంపనలు
    బి) అటవీ నిర్మూలన
    సి) శిలా శైథిల్యం డి) గనుల తవ్వకం
37. 'అంతర్జాతీయ ప్రకృతి వైపరీత్యాల తగ్గింపు దశాబ్దం'గా యూఎన్‌వో ఏ కాలాన్ని ప్రకటించింది?
    ఎ) 2000-2010 బి) 1990-2000
    సి) 2005-2015 డి) 2010-2020
38. కింది వాటిలో 'కేంద్రీయ ఉద్భేదనం' ద్వారా ఏర్పడిన అగ్నిపర్వతం ఏది?
    ఎ) ఎట్నా బి) క్రాకటోవా
    సి) కిలిమంజారో డి) హేల్యాకోలా
39. కింది వాటిలో ప్రపంచ మధ్య పర్వత మేఖలలో ఉన్న అగ్నిపర్వతం ఏది?
    ఎ) వెసూవియస్ బి) ఫ్యూజియామా
    సి) బారెన్ డి) మానాలోవా
40. 'మధ్యధరా సముద్రపు ద్వీపస్తంభం' అని ఏ అగ్నిపర్వతాన్ని పిలుస్తారు?
    ఎ) కిలిమంజారో బి) స్ట్రాంబోలి
    సి) నార్కొండం డి) ఫ్యూజియామా
41. సార్క్ దేశాల విపత్తు నిర్వహణ కేంద్రం ఎక్కడ ఉంది?
    ఎ) ఢాకా బి) కొలంబో
    సి) ఖాట్మండ్ డి) న్యూఢిల్లీ
42. ప్రపంచ విపత్తు నివేదికను ఎవరు తయారు చేస్తారు?
    ఎ) యూఎన్‌వో
    బి) ఇంటిగ్రేటెడ్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్
    సి) ఇంటర్నేషనల్ రెడ్‌క్రాస్ సొసైటీ
    డి) ఇంటర్నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆర్గనైజేషన్
43. విపత్తు నిర్వహణలో అత్యంత ముఖ్యమైన అంశం ఏది?
    ఎ) ఉపశమన చర్యలు
    బి) విపత్తు హెచ్చరిక సి) పునరావాసం
    డి) నష్ట నివారణ చర్యలు

సమాధానాలు

1) బి	2) డి	3) ఎ	4) డి	5) ఎ
6) డి	7) డి	8) బి	9) డి	10) ఎ
11) బి	12) ఎ	13) ఎ	14) డి	15) సి
16) ఎ	17) డి	18) బి	19) డి	20) బి
21) బి	22) ఎ	23) బి	24) ఎ	25) సి
26) బి	27) డి	28) సి	29) ఎ	30) సి
31) బి	32) డి	33) డి	34) డి	35) సి
36) ఎ	37) బి	38) ఎ	39) ఎ	40) బి
41) డి	42) సి	43) బి		


గతంలో వచ్చిన ప్రశ్నలు

1. ఆఫ్రికాలోని 'గుడ్‌హోప్ అగ్రం' వద్ద భూకంపం సంభవించింది. దాని 'S' తరంగాలు కింది వాటిలో ఏ ప్రాంతానికి ముందుగా చేరుతాయి? *(డీఎస్సీ-2012)*
   ఎ) బ్రెజిల్ బి) ఈజిప్ట్
   సి) ఆస్ట్రేలియా డి) అంటార్కిటికా
2. 2004లో హిందూ మహాసముద్రంలో వచ్చిన చారిత్రాత్మక సునామీ మాగ్నిట్యూడ్ ఎంత? *(డీఎస్సీ-2012)*
   ఎ) 6.0 బి) 7.0
   సి) 8.0 డి) 9.0
3. ప్రపంచంలో అత్యంత చురుకుగా ఉన్న అగ్నిపర్వతం ఏది? *(టెట్-2017)*
   ఎ) మౌంట్ వెసూవియస్
   బి) స్ట్రాంబోలి
   సి) మౌంట్ కిలిమంజారో
   డి) ఫ్యూజియామా
4. మెక్సికో సింధుశాఖలో ఏర్పడే చక్రవాతాలను ఏమంటారు? *(టెట్ - 2014)*
   ఎ) టైఫూన్లు బి) హరికేన్లు
   సి) సైక్లోన్లు డి) విల్లీ-విల్లీ
5. ద్రవ పదార్థాల ద్వారా ప్రసరించలేని భూకంప తరంగాలు ఏవి? *(డీఎస్సీ-2006)*
   ఎ) S తరంగాలు బి) M తరంగాలు
   సి) L తరంగాలు డి) P తరంగాలు

సమాధానాలు

1) బి 2) డి 3) బి 4) బి 5) ఎ

అంకెలు కలపండి రంగులు వేయండి



నాన్నా చెప్పవా

గాల్లోంచి నీటిని వేరు చేయవచ్చా?

గాల్లో అనేక వాయువులతో పాటు నీటి ఆవిరి కూడా ఉంటుందన్న సంగతి మీకు తెలుసు కదా. గాలిలోని ఈ నీటి ఆవిరిని చల్లార్చి, వేరు చేయడం ద్వారా మనం మంచి తాగునీటిని పొందవచ్చు. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకుని ''వాటర్ మిల్'' (జలయంత్రం) పేరుతో శాస్త్రజ్ఞులు ఈ మధ్యనే ఒక ప్రత్యేక పరికరాన్ని రూపొందించారు. వాటర్ ఫిల్టర్ లాగా చాలా సులభంగా వాడుకొనేందుకు వీలయ్యే ఈ సాధనం త్వరలోనే ప్రపంచమంతటా అందుబాటులోకి వస్తుందని అంటున్నారు. ఏ ప్రదేశంలో ఉంచినప్పటికీ అక్కడి గాలిని స్వీకరించి, అందులోని నీటి ఆవిరిని వేరుచేసి, దానిని చల్లార్చి నీరుగా మార్చి ఈ పరికరం మనకు అందిస్తుంది. ఎడారి ప్రాంతాలు, నీటికి కటకటగా వుండే ప్రాంతాల వారికి 'వాటర్‌మిల్' ఒక వరం లాంటిదే అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఇప్పటికి కొన్ని వేల సంవత్సరాల కిందట మన భూగోళం మీద కొన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ తమ నీటి అవసరాలను తీర్చుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. క్రిమియా అనే ఎడారి ప్రాంతంలో నివసించే ప్రజలు దాదాపుగా ఒక పిరమిడ్ ఆకారంలో వుండే కట్టడాలను నిర్మించి వాటి సాయంతో మంచినీటిని ఉత్పత్తి చేసుకునే వారు.



సముద్రం నుంచి బయలుదేరి ఎడారి మీదుగా ప్రయాణించే గాలి కొన్ని ప్రత్యేకమైన ఏర్పాట్ల ద్వారా పిరమిడ్ (లాంటి కట్టడం) లోకి వెళ్లేది. ఆ వేడిగాలి పిరమిడ్‌లోకి వెళ్లగానే దాని లోపలి గోడలకు తగిలి చల్లబడేది. ఇందుకు అనువుగా ఆ కట్టడం లోపలి గోడల్లో లెక్కలేనన్ని రంధ్రాలు, చిన్న చిన్న సొరంగ మార్గాలు వుండేవి. ఇలా సముద్రపు గాలి చల్లబడగానే అందులోని నీటి ఆవిరి చిన్న చిన్న తుంపరల్లాగా పిరమిడ్ గోడలకు అంటుకొనేది. ఈ ప్రక్రియ మళ్లీ మళ్లీ జరుగుతూ వుండడంతో చిన్న చిన్న నీటి తుంపరలు క్రమేణా పెద్ద చుక్కలుగా మారి, రాతి కట్టడం గోడల వెంబడి జారి కిందికి చేరుకునేవి. ఆ విధంగా కట్టడం కింది భాగంలో పెద్ద మొత్తంలోనే నీరు సేకరించబడేది. పురాతత్వ శాస్త్రజ్ఞులు జరిపిన తవ్వకాలలో ఇలాంటి కట్టడాలు బయట పడినప్పుడు వారి తెలివితేటలకు నిజంగానే అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు.


పక్కన రెండు బొమ్మల మధ్య 10 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.






లెక్కించండి

కింది బొమ్మలో ఎన్ని త్రికోణాలు ఉన్నాయో లెక్కించండి



కింద ఇచ్చిన ఆవు బొమ్మను పక్కన ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి.



పక్కన ఉన్న ఆరు నీడలలో కింద రంగులలో ఉన్న బొమ్మ అసలైన నీడ ఏదో గుర్తించండి






త్రికోణాలు: 28

ప్రకాశం | సోమవారం | జనవరి | 1 | 2018 సాక్షి

సెల్ఫీ విత్ సెలెబ్రిటీ

'సాక్షి' సెల్ఫీ విత్ సెలెబ్రిటీ శీర్షికకు పాఠకులు విశేషంగా స్పందించారు. తమ అభిమాన నటులు, దర్శకులు, క్రీడాకారులతో దిగిన ఫొటోలను 'సాక్షి'తో పంచుకున్నారు.


నటుడు రవిబాబుతో వెంకటేష్, తమ్మవరం


అదిరే అభితో కాశింషహీద్, పొదిలి


కొరియోగ్రాఫర్ శేఖర్‌తో విజయ్, పెరిదేపి


విజయ్‌చందర్‌తో శ్రీను, ఒంగోలు


త్రివిక్రమ్‌తో బాషా


దర్శకుడు కళ్యాణ్‌కృష్ణతో కె.రాజేష్, ఉప్పుగుండూరు


దర్శకుడు మారుతితో లక్ష్మణ్, అద్దంకి


క్రికెటర్ రైనాతో లాస్య


రాజీవ్ కనకాలతో ఫణిందర్, దర్శి


నటుడు రావు రమేష్‌తో రవితేజ


బ్యాడ్మింటన్ స్టార్ శ్రీకాంత్‌తో హుమాయున్ కబీర్



Praja Sankalpa Yaatra

ప్రజా సంకల్ప యాత్ర

కొండంత ఓదార్పు



పెద్దమ్మకు ధైర్యం చెబుతున్న జగన్

పెద్ద దిక్కు నువ్వే



అవ్వ సమస్యను ఆలకిస్తూ..

సంతోషాల సెల్ఫీ



జగనన్నతో సెల్ఫీ

అన్న దీవెన



చిన్నారికి నామకరణం చేసి..
చెల్లెమ్మను ఆశీర్వదిస్తూ..



నవ సంకల్పం

నోటమాటరాని రైతులు
'పట్టు' తప్పుతున్న అన్నదాతలు
అప్పుల కుంపటిలో అక్కాచెల్లెమ్మలు
వైద్యానికి దూరమవుతున్న బడుగు జీవులు
పింఛన్ కోసం ఎదురు చూస్తున్న అవ్వాతాతలు..
కరువు నేలపై కంటికి కన్పించే దృశ్యాలు.



కొత్త ఏడాది సరికొత్తగా ఉండాలని..
సమస్యలన్నీ సమసిపోవాలని..
కర్షకుల కష్టాలు తొలగిపోవాలని..
రాజన్న కలలు నెరవేరాలని..
నవ సంకల్పంతో అడుగులేస్తున్న జగనన్నకు జనం బ్రహ్మరథం పట్టారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా మూడో రోజు ఆదివారం జననేతకు తంబళ్లపల్లె నీరాజనం పలికింది.



సంఘ మిత్రల సమస్యలు వింటూ..



అన్నయ్య దీవెన : చెల్లెమ్మలను ఆప్యాయంగా పలకరిస్తున్న జగనన్న

కొండంత ఆసరా..



అవ్వా.. మీ వెంటే ఉంటా..

జ'గ'నానందం



జగన్‌ను చూసేందుకు మేడలెక్కిన అభిమానులు

చిట్టి తల్లికి నామకరణం



చిన్నారికి విజయమ్మ అని నామకరణం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

ఆరోగ్యంపై ఆరా



కన్నీళ్లు తుడుస్తూ..

భవిష్యత్‌కు భరోసా



రాజన్న బిడ్డను చూసి ఆనందం

ఆప్యాయతకు అండ



కష్టాలు వింటూ ..

విరిసి..మురిసి

పూల బాటలో పాదయాత్ర





అన్నయ్యతో చెల్లెమ్మలు



నిఘా నీడ : డ్రోన్ కెమెరాలతో పరిశీలన



మహా నివాళి: వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించేందుకు వెళుతున్న జగన్‌మోహన్ రెడ్డి

ఓటేయలేదని..



'అయ్యా.. రెండేళ్ల క్రితం నాకు యాక్సిడెంట్ అయ్యి కాలు విరిగింది. ఆస్పత్రికి వెళితే కాలు తీసేసినారు. తిండి కూడా లేకుండా అల్లాడతా ఉండా. పింఛన్ కోసం రెండుసార్లు జన్మభూమిలో కాగితాలిచ్చినా. ఓసారి పేరు కూడా వచ్చింది. కానీ నేను టీడీపీ వాడిని కాదని పింఛన్ ఆపేసినారు' అంటూ తంబళ్లపల్లెలోని రేణిమాకులపల్లెకు చెందిన జబ్బార్ వాపోయాడు. మీరే న్యాయం చేయాలంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభ్యర్థించాడు. రేణిమాకులపల్లెకు చెందిన 48 ఏళ్ల మహబూబ్‌బాషా మాట్లాడుతూ తనకు పుట్టిన కొన్నాళ్లకే రెండు కాళ్లూ పనిచేయడం మానేశాయని, పింఛన్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నట్లు వాపోయాడు. – చిత్తూరు అర్బన్

'పట్టు'తప్పుతున్నాం!



'పక్కనున్న కర్ణాటక రాష్ట్రంలో పట్టు రైతులకు గవర్నమెంటు మంచి ఇన్‌సెంటివ్ ఇస్తా ఉండాది. మన ప్రభుత్వం ఏమీ పట్టించుకోవడం లేదు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఏటా ఆరు పంటలు వేస్తా ఉండాం. ఎప్పుడూ రైతు అడిగిన ధర ఇవ్వలేదు. పట్టు గూళ్లు అమ్మితే.. కష్టం కూడా దక్కేదిలేదు. మీరు పెద్ద మనసు చేసుకుని పట్టుగూళ్లకు రూ.వంద ఇన్‌సెంటివ్ ఇస్తే మాబోటి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది..' అంటూ ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డిని మదనపల్లె కోళ్ల బైలుకు చెందిన అక్కుల్‌రెడ్డి కోరారు. – చిత్తూరు అర్బన్

ప్రశ్నిస్తే అరెస్టులు



'అన్నా.. 18 ఏళ్లుగా వెలుగు పథకంలో పనిచేస్తున్నాం. ఇప్పుడు సంఘమిత్రలుగా ఉన్నాం. ప్రభుత్వం చేపట్టే ప్రతి ఒక్క పనినీ ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం. ప్రతి పల్లెకూ తిరుగుతున్నాం. కానీ మాకిచ్చేది నెలకు రూ.1,250లే. అది కూడా గ్రామ సంఘం నుంచి తీసుకోమంటా ఉండారు. కనీసం ఉద్యోగ భద్రత లేదు. దానిక్కూడా బాధ లేదు. మమ్మల్ని మనుషులుగా గుర్తిస్తేచాలు. మా డిమాండ్లపై ప్రభుత్వాన్ని నిలదీద్దీమన్నా.. ధర్నా చేద్దామనుకున్నా వెంటనే అరెస్టు చేసేస్తా ఉండారు. ఇదేం పద్ధతన్నా' అంటూ తంబళ్లపల్లె మండలం ఎర్రసానిపల్లెకు చెందిన మహిళలు ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. సంఘమిత్ర వ్యవస్థను పటిష్టం చేయాలని, నెలకు రూ.15 వేల వేతనం ఇవ్వాలని కోరారు. – చిత్తూరు అర్బన్

బాబు మోసం



'డ్వాక్రా రుణాల మాఫీ పేరిట సీఎం చంద్రబాబు మహిళా లోకాన్ని మోసం చేశారు. ఇప్పుడు పసుపు కుంకుమ పేరుతో మూడు వేల రూపాయలిచ్చి, అదికూడా అకౌంట్లో నుంచి డ్రా చేసుకోకూడదని ఆంక్షలు పెట్టారు. పావలా వడ్డీ కూడా రద్దు చేయలేదు. వాటిపై రూ.1.5 పైసలు వడ్డీ కడుతున్నాం' అంటూ జల్లావారిపల్లెకు చెందిన గణేష్ మహిళా సంఘ సభ్యురాలు సరస్వతమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదయాత్రలో పాల్గొన్న మహిళలు జగన్‌మోహన్ రెడ్డికి కష్టాలు తెలియజేశారు. – తంబళ్లపల్లె